# రైతులను ముంచిన కాంగ్రెస్ సర్కార్



-దక్కని గిట్టుబాటు..
అందని రైతుబంధు
-ఖమ్మం మార్కెట్ యార్డు
సందర్శనలో
మాజీ మంత్రి
హరీశ్‌రావు

మెయిన్‌లో..

www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
శనివారం | 23 | నవంబర్ | 2024
పేజీలు 8

# దండకారణ్యం రక్తసిక్తం



- ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్
- 10 మంది మావోయిస్టులు హతం
- ఛత్తీస్‌గఢ్‌లో శాంతి నెలకొంటోంది : సిఎం విష్ణుదేవ్ సాయి
- ఇన్‌ఫార్మర్ల నెపంతో ఇద్దరి హత్య

**ప్రజాపక్షం/భద్రాచలం :** ఛత్తీస్‌గఢ్ దండకారణ్య పచ్చని అడవులు మరో సారి రక్తసిక్తమయ్యాయి. శుక్రవారం ఉదయాన్నే చోటు చేసుకున్న ఎన్‌కౌంటర్లో ఏకంగా 10 మంది మావోయిస్టులు హతమయ్యారు. ఆ రాష్ట్రంలోని సుకుమా జిల్లా కొంటా బ్లాక్ పరిధిలోని బెజ్జీ పోలీస్ స్టేషన్ అటవీ ప్రాంతంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ విషయాన్ని ఆ రాష్ట్ర ఇన్స్‌పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (బస్తర్ రేంజ్) పి. సుందర్ రాజ్ ధృవీకరించారు. తెలిపిన వివరాల ప్రకారం. కొరాజ్‌గూడ, దంతేస్‌పూరం, నాగారం, భండరపదర్ గ్రామాల సరిహద్దుల్లోని అటవీ కొండలపై కొంటా, కిష్టారం ఏరియా కమిటీ మావోయిస్టు దళాలు ఉన్నారనే పక్కా సమాచారం మేరకు భద్రతా బలగాలు ఆ కొండలను ముందు రాత్రే చుట్టుముట్టాయి. కాగా తెల్లవారు తుండగానే కొండలపైకి చేరుకున్న డిఆర్‌జి, సిఆర్‌పిఎఫ్, బస్తర్ ఫైటర్ ఫోర్స్ భద్రతా బలగాలు లొంగిపోవాలంటూ హెచ్చరికలు జారీ చేసినప్పటికీ మావోయిస్టు పార్టీ ఒక్క సారిగా ఎదురుకాల్పులకు పూనుకుంది.

మిగతా 2లో..

# గిరిజన రైతులకు అన్యాయం చేస్తే సహించం



-దారి ఇప్పించాల్సిన బాధ్యత అధికారులదే : సిపిఐ
-దారి విషయంలో ఉద్రిక్తత

**ప్రజాపక్షం/నేలకొండపల్లి:** గిరిజన రైతులకు అన్యాయం చేస్తే సహించబోమని సిపిఐ నేతలు హెచ్చరించారు. 50 ఎకరాల్లో వరి పంట కోతకు మించి తూలిపోతుందని తీవ్ర నష్టం జరిగే అవకాశం ఉందని గిరిజన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నా దారి సమస్యకు పరిష్కారం చూపకపోవడం శోచనీయమని వారు తెలిపారు. నేలకొండపల్లి మండల పరిధిలోని తిరుమలాపురంలో దారి విషయంలో కొంత కాలంగా చిన్న, సన్నకారు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. 50 ఎకరాల్లో చిన్న, సన్నకారు గిరిజన రైతులు వరిపంటను సాగు చేయగా ఆ గ్రామానికి చెందిన ఓ రైతు మీ భూమికి దారి లేదంటూ గిరిజన రైతులను వెళ్లనివ్వకుండా అడ్డుకుంటున్నారు. 50 ఎకరాలను 33 మంది

మిగతా 2లో..

# బస్సు తప్ప.. అంతా తుస్సే..



-అదానీతో ఢిల్లీలో లొల్లి.. గల్లీలో దోస్తీ
-రేవంత్ రెడ్డి ప్రజలకు క్షమాపణ చెప్పాలి
-మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు

**ప్రజాపక్షం/చింతకాని :** రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో ఉచిత బస్సు ప్రయాణం తప్ప.. అంతా తుస్సేనని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు పేర్కొన్నారు. చింతకాని మండలం ప్రొద్దుటూరు, లచ్చగూడెం గ్రామాల్లో ఇటీవల మరణించిన భాధిత రైతులు బోజెడ్ల ప్రభాకర్,గూని ప్రసాద్ కుటుంబాలతో పాటు అక్రమ అరెస్ట్‌తో అరెస్ట్‌అయి జైలుజీవితం గడిపిన బొరాస మండల పార్టీ అధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్య కుటుంబాలని ఆయన శుక్రవారం పరామర్శించారు.ఈ సందర్బంగా ప్రొద్దుటూరులో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో హరీష్‌రావు మాట్లాడుతూ మార్పు కావాలని తెచ్చుకున్న

మిగతా 2లో..

# ముగ్గురు డిడిల వ్యవస్థ అక్రమ లోపాల పుట్ట




-అవస్థల నిలయంగా సంక్షేమ హాస్టళ్లు
-సమస్యల పరిష్కారం కోరుతూ కలెక్టరేట్ వద్ద ఏఐఎస్ఎఫ్ నిద్ర
-భగ్నం చేసిన పోలీసులు

6లో

# నిరుపయోగంగా క్రీడా ప్రాంగణాలు..!

-మాయమైన క్రీడా సామగ్రి
-పేరుకే క్రీడా ప్రాంగణాలు
-నిర్వహణ లోపంతో దూరమైన క్రీడాకారులు

8లో



# దండకారణ్యం రక్తసిక్తం




(మొదటిపేజీ తరువాయి)

దీంతో ఆత్మరక్షణ కోసం బలగాలు సైతం కాల్పులకు దిగారు. ఇరు వర్గాల మధ్య సుమారు రెండు గంటలకు పైగా హోరాహోరీ ఎదురు కాల్పులు చోటు చేసుకున్నాయి. భద్రతా బలగాల తూటాలకు తాళలేని మావోయిస్టు పార్టీ సభ్యులు కొండల నుండి చెట్లను చాటుగా చేసుకుని క్రిందికి పారిపోయి దట్టమైన అటవీ ప్రాంతంలోనికి జారుకున్నారు. కాల్పులు అటువైపు నుండి ఆగిపోవడంతో ఘటనా స్థలం వద్ద తనిఖీలు చేయడంతో పది మంది మావోయిస్టుల మృత దేహాలు లభ్యమయ్యాయి. ఇన్సాస్ 1, ఏకే 471, ఎస్ఎల్ఆర్ 1 తుపాకితహా పెద్ద ఎత్తున ఆయుధాలు సైతం లభించాయి. తప్పించుకున్న మావోయిస్టుల కోసం బలగాలు ముమ్మర గాలింపు చర్యలు చేపట్టాయి.

**సరిహద్దుల్లో హై అలెర్ట్ ...**

సుకుమా జిల్లాలో చోటు చేసుకున్న ఎన్‌కౌంటర్ నేపథ్యంలో ఆ రాష్ట్రంతో పాటు సరిహద్దు రాష్ట్రాల పోలీస్ ఉన్నతాధికారులు హై అలెర్ట్ ప్రకటించారు. అటవీ ప్రాంతాల్లో నుండి ప్రధాన రహదార్లకు చేరుకునే కచ్చ దార్లు, గోదావరి ఫెర్రీ పాయింట్లపై నిఘా పెట్టారు. వచ్చిపోయే వాహనాలను తనిఖీ చేస్తున్నారు. మావోయిస్టులు పార్టీకి చెందిన సభ్యులు తలదాడుకునేందుకు తెలంగాణ అటవీ ప్రాంతంలోనికి అడుగుపెట్టే అవకాసం ఉన్నట్లు నిఘావర్గాలు ఇప్పటికే పలుమార్లు హెచ్చరించిన నేపథ్యంలో ఛత్తీస్‌గఢ్ఆంధ్రాతెలంగాణఒడిస్సా రాష్ట్రాల్లో హై అలెర్ట్ ప్రకటించారు. జాతీయ రహదార్లను తమ ఆదీనంలోనికి తీసుకున్న పోలీసులు నిఘా కట్టుదిట్టం చేశారం.

**వరుస విజయాలు...**

2026 మార్చి 31న నాటికి ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో మావోయిస్టులు లేకుండా ఏరివేస్తామని కేంద్ర హోమ్ శాఖా మంత్రి అమీత్‌షా చెప్పినట్లు దండకారణ్యాన్ని జల్లెడ పడుతున్న భద్రతా బలగాలు ఏడాదిగా వరుస విజయాలు నమోదు చేసుకుంటున్నారు. ఈనెల 16న ఛత్తీస్‌గఢ్ రాష్ట్రలోని నారాయణ్‌పూర్ జిల్లాలో జరిగిన ఎన్ కౌంటర్‌లో ఐదుగురు మావోయిస్టులు హతమవగా, ఇద్దరు జవన్లాకు తీవ్ర గాయాలయ్యాయి. ఆ సంఘటనను మరువక ముందే అతి కొద్ది రోజుల్లోనే మరో ఎన్‌కౌంటర్ చోటు చేసుకుంది. సుకుమా జిల్లాతో పాటు బస్తర్ రేంజ్ పరిధిలోని ఏడు జిల్లాల్లో ఈ ఏడాదిగా ఇప్పటి వరకు వేర్వేరు సంఘటనల్లో మొత్తం 207 మంది మావోయిస్టులు హతమయ్యారు.

**ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో శాంతి నెలకొంటోంది : సిఎం విష్ణుదేవ్ సాయి ...**

వరుస ఎన్‌కౌంటర్ల నేపథ్యంలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయి భద్రతా బలగాలను ప్రశంసించారు. మావోయిస్టుల ఏరివేతతో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో శాంతి నెలకొనడంతో పాటు అభివృద్ధి వేగం పుంజుకుంటుందని ప్రకటించారు. రాష్ట్రంలో నివశించే అన్ని వర్గాల పౌరులకు భద్రత కల్పించడమే తమ ప్రభుత్వ ధ్యేయమని చెప్పారు. నక్సలైట్లను తుడిచిపెట్టేందుకు కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా పనిచేస్తున్నాయని, మావోయిస్టుల నిర్మూలన ఖాయమని చెబుతూ శాంతి, ప్రగతి యుగతంతో పాటు అభివృద్ధి శకం మొదలవనుందని అన్నారు. 2026 మార్చి చివరి నాటికి రాష్ట్రంలో మావోయిస్టు పార్టీని నిర్మూలించాలని కేంద్ర హోమ్‌శాఖామంత్రి అమీత్‌షా నిర్దేశించిన లక్ష్యాన్ని నెరవేర్చేందుకు ప్రణాళికా బద్దంగా ముందుకు సాగుతున్నట్లు ఈ సందర్భంగా ముఖ్యమంత్రి తెలిపారు.

**ఇద్దరిని నరికి చంపిన మావోయిస్టులు...**

ఛత్తీస్‌గఢ్‌మహారాష్ట్ర సరిహద్దున తెలంగాణ రాష్ట్రంలోని ములుగు జిల్లా, వాజేడు మండలం పెనుగోలు కాలనీకి చెందిన ఇద్దరు అన్నదమ్ములను మావోయిస్టులు విచక్షణారహితంగా గొడ్డళ్లతో నరికి చంపారు. పేరురూ గ్రామ కార్యదర్శిగా పనిచేస్తున్న ఉయికా రమేష్, అతని తమ్ముడు ఉయికా అర్జున్‌లు పోలీస్ ఇన్‌ఫార్మర్లుగా మారి దళాల సమాచారాన్ని పోలీసులకు చేరవేస్తున్నారనే నెపంతో గురువారం అర్థరాత్రి ఇంట్లో నిద్రిస్తున్న వారిని బయటకు తీసుకొచ్చి గ్రామానికి అతి సమీపంలో గొడ్డళ్లతో నరికారు. అర్జున్ అక్కడికక్కడే మృతి చెందగా, రమేష్‌ను ఆస్పత్రికి తరలిస్తున్న క్రమంలో ప్రాణాలు విడిచాడు. పద్ధతి మార్చుకోవాలంటూ గతంలో వీరద్దరినీ మావోయిస్టులు హెచ్చరిస్తున్నట్లు తెలుస్తోంది. పలుమార్లు హెచ్చరించినప్పటికీ రమేష్, అర్జున్‌లు ప్రవర్తను మార్చుకోక పోలీస్ ఇన్‌ఫార్మర్లుగా పనిచేస్తున్నారని, దళం సమాచారాన్ని చేరవేస్తూ ఉనికిని దెబ్బతీస్తున్నారని, దీనిని ఆపేందుకే వారిద్దరిని ఖతం చేస్తున్నట్లు వాజేడువెంకటాపురం మావోయిస్టు ఏరియా కార్యదర్శి శాంత పేరిట లేఖ విడుదలైంది.

# బస్సు తప్ప.. అంతా తుస్సే..

(మొదటిపేజీ తరువాయి)



కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతుబంధు,బతుకమ్మ చీరలు,కేసిఆర్ కిట్,దళిత బంధు,బీసీబంధు, న్యూట్రీషన్ కిట్ బందు చేసి పెద్ద మార్పు తెచ్చిందన్నారు. ప్రభుత్వం ఏర్పడ్డ 100రోజుల్లో ఆరుగ్యారెంటీలు అమలుచేస్తామని బాండ్లు పంచిన రేవంత్‌రెడ్డి , భట్టి విక్రమార్కలు ఏ ఒక్క హామీనీ అమలు చేయకుండా ఏడాది పాలన ఉత్సవాలు ఎలా చేస్తున్నారని ప్రశ్నించారు. కరోనా కష్టకాంలో సైతం రైతుబంధు ఇచ్చిన ఘనత కేసిఆర్‌దేనన్నారు.అక్కచెల్లెమ్మలకు నెలకు రూ.2500 ఇస్తానన్న రేవంత్ రెడ్డి సర్కార్ ప్రతి అక్కచెల్లెమ్మకు రూ.27,500 బాకీ పడిందన్నారు.రేవంత్‌రెడ్డి దేవుళ్ళ మీద ఒట్లు పెట్టి వాగ్దానాలు చేస్తాడని లేకపోతే తిట్లు దండకం మాట్లాడతాడన్నారు.ఇప్పటికైనా రేవంత్ సర్కార్ ఆత్మవిమర్శన చేసుకోని ప్రజలకు క్షమాపణ చేప్పాలన్నారు.అవ్వతాతలకు నాలుగువేల పెన్షన్ ఇస్తానని, మహిళలకు మహిళా శక్తి ఇవ్వకుండా మోసం చేసిన కాంగ్రెస్ సర్కార్ ఏపీలో చంద్రబాబు ను ఆదర్శంగా తీసుకుని బకాయితో సహా అక్కచెల్లెమ్మలకు అవ్వతాతలకు పథకాలు అమలుచేయాలన్నారు. అదానీని వెంటనే అరెస్ట్ చేయాలని రాహుల్‌గాంధీ డిమాండ్ చేస్తుంటే రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన ఆరునెలల్లో 100కోట్ల చెక్కు అదానీనుండి రేవంత్ ఎలా తీసుకున్నాడో డిల్లీ పెద్దలే చెప్పాలన్నారు. కేసిఆర్ 10ఏళ్ళ అధికారంలో అదానీని తెలంగాణలో అడుగుపెట్టన్విలేదని గుర్తుచేశారు.మాది ఇందిరమ్మ రాజ్యం,ప్రజాప్రభుత్వం అని చెప్పే రేవంత్ సర్కార్ ప్రజాస్వామ్యాన్ని కూనీ చేసిందని ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు పెడుతూ బారాస కార్యకర్తలను నాయకులను జైళ్లకి పంపుతుందన్నారు. పోలీసులు రాజ్యాంగానికి చట్టానికి లోబడి పనిచేయాలనివచ్చేది బిఆర్ఎస్ ప్రభుత్వమే నని కార్యకర్తలని ఇబ్బంది పెడితే సహించేది లేదని పెంట్యాల పుల్లయ్య అరెస్ట్ అప్రజాస్వామికమని పుల్లయ్య అరెస్ట్ లో పోలీసు తీరు ఆక్షేపనీయమనీ కాంగ్రెస్ కి గులాం చేసే పోలీస్ అధికారులు గుర్తుంచుకోవాలని అధికారంలోకి వచ్చిన తర్వాత వడ్డీతో సహా చెల్లీస్తామని హెచ్చరించారు.కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని అధైర్య పడవద్దని కంటికి రెప్పలా కార్యకర్తలను కాపాడుకుంటామని భరోసా కల్పించారు.ప్రతిపక్ష ఎమ్మెల్యే ఉన్న మదిర నియోజకవర్గం చింతకాని మండలంలో కేసిఆర్ ఫైలట్ ప్రాజెక్ట్ కింద 3280 కుటుంబాలకు దళీత బంధు ఇస్తే అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ లబ్దిదారుల ఖాతాలో ఉన్న రెండవ ఇన్‌స్టాల్‌మెంట్ నగదు ఇవ్వకుండా తాత్సారం చేస్తుందని శీతాకాల అసెంబ్లీ సమావేశాల్లో ఈ అంశం పై ప్రశ్నిస్తానని తక్షణమే దళిత బంధు లబ్దిదారులకు పెండింగ్ అమోంట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.అంతకు ముందు ప్రొద్దుటూరులో బారాస కార్యకర్తలు హరీష్ రావుకు పూలవర్షంతో అపూర్వ స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు గంగుల కమలాకర్,పువ్వాడ అజయ్‌కుమార్,ఎంపీ వద్దిరాజు రవిచంద్ర,మాజీ ఎమ్మెల్యేలు కొండబాల కోటేశ్వర రావు,సండ్ర వెంకటవీరయ్య, ఎమ్మెల్సీ తాతా మధు,నాయకులు రాకేష్ రెడ్డి,జిల్లాపరిషత్ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు,బొమ్మెర రామ్మూర్తి,పెంట్యాల పుల్లయ్య,మంకెన రమేష్,గురిజాల హనుమంత రావు,వెంకటరామారావు,బండి రామారావు,ఖమ్మం నగరపార్టీ అధ్యక్షుడు పగడాల నాగరాజు,సుడా మాజీ చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్,లీగల్‌సెల్ నాయకులు బిచ్చాల తిరుమలరావు ,చింతకాని మండల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# పిల్లల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్:** వాతావరణ పరిస్థితిలో వస్తున్న మార్పు నేపథ్యంలో హాస్టల్‌లలో చదివే పిల్లల ఆరోగ్యం పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ జలగంనగర్‌లోని మైనార్టీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ సొసైటీని (బాలురు) తనిఖీ చేశారు. విద్యాలయ ఆవరణ లోపల పరిశీలించిన కలెక్టర్ విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, విద్యాలయంలో తరగతుల నిర్వహణ, పాఠ్యపుస్తకాలు అందించారా, విద్యార్థులకు అందిస్తున్న భోజనం, త్రాగునీరు వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. రెసిడెన్షియల్ పాఠశాల, హాస్టల్ పరిసరాలు, ప్రాంగణాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అధికారులకు సూచించారు. విద్యార్థులకు తాజా సరుకులు, కూరగాయలతో భోజనం అందించాలన్నారు. నిల్వ చేసిన భోజనం పదార్థాలు విద్యార్థులకు ఇవ్వవద్దని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో జూనియర్ లెక్చరర్లు జావేద్ పాషా, ఇందిర, మహేష్, సిబ్బంది హసన్, పర్వేజ్ తదితరులు ఉన్నారు.



# గిరిజన రైతులకు అన్యాయం చేస్తే సహించం

(మొదటిపేజీ తరువాయి)



గిరిజన రైతులు సాగు చేసుకుంటున్నారు. వరి సాగు చేయగా ఇప్పుడు కోతకు వచ్చి తూలిపోతున్నా దారి లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ జె. మాణిక్‌రావు, ఎస్ఐ పి. సంతోష్‌లు క్షేత్రస్థాయికి వెళ్లి విచారించారు. సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా, జిల్లా కార్యవర్గ సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, కర్నాటి భానుప్రసాద్ తదితరులు గిరిజన రైతుల భూములను పరిశీలించారు. తక్షణం పంటను కోసుకుని ధాన్యాన్ని బయటకు తెచ్చుకునేందుకు అవకాశం కల్పించాలని కోరారు. అధికారులు సైతం ధాన్యం తరలించేందుకు అవకాశం కల్పించాలని దారిని అడ్డుకుంటున్న రైతుకు సూచించారు. ఈ సందర్బంగా బాగం హేమంతరావు మాట్లాడుతూ గిరిజనులు పంట తెచ్చుకునేవిధంగా దారి కల్పించాలని, దారికి అడ్డంగా వేసిన కంచెను తొలగించాలని రైతులను ఇబ్బందులు పెట్టడం సరైంది కాదన్నారు. భూములను పరిశీలించిన వారిలో జిల్లా సమితి సభ్యులు కనకబండి సీతారాములు, మండల సహాయ కార్యదర్శులు పాల్తీయా శ్రీనివాస్, ఎం. వెంకటేశ్వరరావు, బాలిన కృష్ణంరాజు, గిరిజన రైతులు ఉన్నారు.

## చెరకు రైతుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి

**ప్రజాపక్షం/వైరా:** కేంద్ర ప్రభుత్వం చెరకు మద్దతు ధర టన్ను ఐదువేల రూపాయలు ప్రకటించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. ముటాపురంలో శనివారం చెరకు రైతుల రాష్ట్ర సదస్సు నిర్వహించడం జరుగుతుందని ఆ సదస్సును జయప్రదం చేయాలని కోరుతూ శుక్రవారం వైరా మండలంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్బంగా బొంతు రాంబాబు మాట్లాడుతూ చెరకు రైతుల సంఘం జాతీయ అధ్యక్షులు రవీంద్రన్, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్‌లు పాల్గొంటారని చెరకు రైతులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో రోజు రోజుకు చెరకు సాగు తగ్గిపోతుందని రాష్ట్ర అవసరాలకు సరిపడ చెరకు దిగుబడి లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చెరకు సాగుదారులకు సబ్సిడీలు, రాయితీలు, ప్రోత్సాహకాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు మల్లెంపాటి రామారావు, బాణాల శ్రీనివాసరావు, చెరకు రైతులు, కామినేని రవి, పల్లెబోయిన కృష్ణ, నర్వనేని యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.



# జిల్లాలో 75.15 శాతం సమగ్ర సర్వే పూర్తి



**-జిల్లా కలెక్టర్ వివరాలు సేకరించిన ఎన్యూమరేటర్**
**-సర్వే వివరాలు వెల్లడించిన కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మంజిల్లాలో నవంబర్ 21నాటికి 71.15 శాతం సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పూర్తయినట్లు జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. శుక్రవారం సర్వే ఎన్యూమరేటర్లు ఖమ్మం కలెక్టర్ క్యాంపు కార్యాలయంకు వెళ్లి జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ కుటుంబ సర్వే నిర్వహించారు. సర్వే సిబ్బందికి కలెక్టర్ పూర్తిగా సహకరిస్తూ వివరాలు తెలియజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఖమ్మంజిల్లాలో హౌజ్ లిస్టింగ్ చేసిన మొత్తం 5,67,338ఇండ్లను సర్వే కోసం గుర్తించామన్నారు. నవంబర్ 21 నాటికి 4129 ఎన్యూమరేటర్ బ్లాక్ పరిధిలో మొత్తం 4,26,333 ఇండ్ల సర్వే పూర్తయిందన్నారు. అసెంబ్లీ నియోజక వర్గాల వారీగా ఖమ్మంలో 54.96 శాతం, పాలేరులో 80.93 శాతం, మధిరలో 80.66 శాతం, వైరాలో 88.54 శాతం, సత్తుపల్లిలో 88.54 శాతం జిల్లా వ్యాప్తంగా 75.15 శాతం సర్వే పూర్తయిందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో పెండింగ్ సర్వే ప్రక్రియ సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజల నుంచి సేకరించిన సమాచారం పకడ్బందీగా భద్రపర్చాలని డేటా ఎక్కడ లీక్ కాకుండా చూసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# మాతృ మరణాలు జరగకుండా చూడాలి

**డిఎంఅండ్‌హెచ్‌వో కళావతిబాయి**





**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** మాతృ మరణాలు జరగకుండా వైద్యాధికారులు, సిబ్బంది తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బి. కళావతిబాయి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లాలో జరిగిన మాతృ మరణాలపై సమీక్ష నిర్వహించారు. డిఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ కళావతిబాయి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాతృ మరణాలు జరగడానికి గల కారణాలను విశ్లేషించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రసవిస్తూ ఏ తల్లి మరణించకూడదు, ప్రసవించిన తర్వాత ఏ బిడ్డ మరణించకూడదు అనే నినాదాన్ని మనం గుర్తు పెట్టుకోవాలని అదే ఉద్దేశ్యంతో వారికి సేవలు అందించాలన్నారు. ముఖ్యంగా గర్భిణీ స్త్రీలకు ప్రతిక్షణం ముఖ్యమైందని దానికి తగినట్లు వైద్యులు, సిబ్బంది సిద్ధంగా ఉండి వారికి అందించాల్సిన చికిత్సలు వెంటనే అందించి మాతృ మరణాలు జరగకుండా చూడాలన్నారు. ఏ సమయంలోనైనా వెంటనే స్పందించి చర్యలు చేపట్టాలని క్షణం ఆలస్యమైనా ప్రమాదం జరుగుతుంది కాబట్టి నిర్లక్ష్యం వహించకుండా నిబద్ధతతో సేవలు అందించాలన్నారు. మాతృ మరణాలకు గల కారణాలు తిరిగి పునరావృతం కాకుండా సేవలు అందించాలని డిఎంఅండ్‌హెచ్‌వో తెలిపారు. మొత్తం ఆరు మరణాలు జరగగా వాటిలో సుబ్లేడు, మామిళ్లగూడెం, వైరా, కల్లూరు, ముస్తఫా నగర్, యం. వెంకటాయపాలెం, పిహెచ్‌సి పరిధిలో గల కేసులకు సంబంధించి సమీక్ష జరిపారు.ఈ కార్యక్రమంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరరావు, డిసిహెచ్ఎస్ డాక్టర్ రాజశేఖర్ గౌడ్, పివో(ఎంసిహెచ్) డాక్టర్ సైదులు, పివో (సిహెచ్ఐ) డాక్టర్ చందునాయక్, జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్, హెచ్‌వోడి (గైనాకాలజి) డాక్టర్ యామిని, ఎఫ్‌వోజిఎస్ఐ డాక్టర్ రెహనాబేగం, డెమో సాంబశివరెడ్డి, డిఎస్‌వో దుర్గ, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఎల్‌ఆర్ఎస్ దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలి



**ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య**

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఎల్‌ఆర్ఎస్ దరఖాస్తులను వేగంగా పరిశీలించాలని ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తేవాలని ఖమ్మం మున్సిపల్ కమిషనర్, సుడా వైస్ ఛైర్మన్ అభిషేక్ అగస్త్య తెలిపారు. శుక్రవారం సుడా పరిధిలోని ఎల్‌ఆర్ఎస్ ఫైళ్ల పరిష్కారంపై ఖమ్మం మున్సిపల్ కార్యాలయంలో సుడా వైస్ ఛైర్మన్, ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్‌ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన వేగవంతం చేయాలని, ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో సుడా పరిధిలోని మండలాల ఎంపివోలు, ఇరిగేషన్ అధికారులు, రెవెన్యూ అధికారులు, డిటిసిపివో ప్రసాద్, సుడా ఏపివో ఖాదర్, సుడా జెపివో ఇటికాల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు భద్రాద్రికి మంత్రి పొంగులేటి



**ప్రజాపక్షం/భద్రాచలం :** రాష్ట్ర, రెవెన్యూ సమాచార శాఖా, గృహ నిర్మాణశాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నేడు భద్రాచలం రానున్నారు. ముందుగా ఆయన శ్రీ సీతా రామ చంద్ర స్వామివారిని దర్శించుకోనున్నారు. అనంతరం కరకట్ట నిర్మాణ పనులను పరిశీలిస్తారు. ఏఎంసి కాలనీలోని డబుల్ బెడ్రూం ఇళ్లను పరిశీలిస్తారు. అనంతరం సంబంధిత జిల్లా అధికారులతో స్థానిక కెకె ఫక్షన్ హాల్లో నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని నిర్వహిస్తారు.

# యువ శాస్త్రవేత్తను కోల్పోవడం బాధాకరం

**-రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి**



**ప్రజాపక్షం/కారేపల్లి:** యువ శాస్త్రవేత్తను కోల్పోవడం బాధాకరమని రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి అన్నారు. మూడు నెలల క్రితం అకాల వరదల్లో మృతి చెందిన గంగారం తండాకు చెందిన యువ శాస్త్రవేత్త అశ్విని, ఆమె తండ్రి మోతిలాల్ చిత్రపటాలకు ఆమె పూలమాల వేసి, ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులు నేజీ, అశోక్‌లను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపి, అండగా ఉంటామని భరోసా కల్పించారు.. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అకాల వరదల్లో మృతి చెందిన యువ శాస్త్రవేత్త అశ్వినికి కాంగ్రెస్ ప్రభుత్వం తగిన గుర్తింపు ఇస్తుందని అన్నారు. అశ్విని ప్రతిభకు గుర్తింపు ఇచ్చే విధంగా ఒక వ్యవసాయ పతకానికి తన పేరు పెట్టే విధంగా ప్రభుత్వానికి సిఫారసు చేస్తానన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏదైతే అశ్విని కుటుంబానికి హామీ ఇచ్చారో వాటన్నింటినీ తప్పకుండా నెరవేరుస్తామని అన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు, మాజీ తాజా ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, మహిళా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# టిఆర్ఆర్ ఆసుపత్రిని సందర్శించిన మాజీ మంత్రులు



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** టిఆర్ఆర్ ఆర్థో, ఎమర్జెన్సీ యూనిట్ ఆసుపత్రిని మాజీ మంత్రులు తన్నీరు హరీష్ రావు, గంగుల కమలాకర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర సందర్శించారు. ఖమ్మం వైరా రోడ్డులో ఇటీవల నూతనంగా ప్రారంభించిన టిఆర్ఆర్ ఆర్థో, యాక్సిడెంట్ కేర్ యూనిట్‌ను శుక్రవారం మాజీ మంత్రులు హరీష్‌రావు, కమలాకర్, ఎంపి వద్దిరాజు రవిచంద్రలు సందర్శించి ఆసుపత్రి నిర్వాహకులు డాక్టర్ తోట లక్ష్మణ్‌కుమార్, తోట రమేష్, తల్లిదండ్రులు తోట రామారావు, గోవిందమ్మలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మణ్‌కుమార్ అతిథులకు పుష్పగుచ్చాలు అందించి శాలువతో సన్మానించారు. ఆసుపత్రి దిన దినాభివృద్ధి చెందిన ప్రజలకు నాణ్యమైన సేవలను అందించి వారి మన్ననలు పొందాలని మాజీ మంత్రులు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో వంగాల వెంకట్, కృష్ణానాయక్, బాబా, కె. రమేష్, రవీందర్, నవీన్, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

# 30న టెన్నీస్ పోటీలు, ఎంపికలు

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మంజిల్లా టెన్నీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 30, డిసెంబర్ ఒకటిన రెండు రోజుల పాటు ఉమ్మడి జిల్లాలో టెన్నీస్ పోటీలు, ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా టెన్నీస్ అధ్యక్షులు బాలసాని విజయ్, కార్యదర్శి సాంబమూర్తి లు శుక్రవారం తెలిపారు. రెండు రోజుల పాటు నిర్వహించే ఈ పోటీల్లో క్రీడాకారులకు ఉచిత భోజనం కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు వయస్సు ధృవీకరణ పత్రాలతో హాజరు కావాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు 11 సంవత్సరాల నుండి 19 సంవత్సరాల వరకు సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తామని, పురుషులు, మహిళలకు కూడా పోటీలు జరుగుతాయని వారు తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు డిసెంబర్ నెలలో హైదరాబాద్‌లోని లాల్‌బహదూర్ స్టేడియంలో జరిగే తెలంగాణ రాష్ట్ర స్థాయి టెన్నీస్‌లో పాల్గొంటారని వారు తెలిపారు. ఈ నెల 25వ లోపు ఎంట్రీలను పంపించాలని తర్వాత వచ్చిన ఎంట్రీలు స్వీకరించబడవని వారు తెలిపారు. మరిన్ని వివరాలకు సెల్ నెం. 9848408335 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

# తమ్మిని పరామర్శించిన ఎంపి రేణుకాచౌదరి



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** చింతగుర్తి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు తమ్మిని నాగేశ్వరరావును కేంద్ర మాజీ మంత్రి, రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి శుక్రవారం పరామర్శించారు. ఇటీవల గుండె సంబంధిత వ్యాధితో చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న తమ్మిని నాగేశ్వరరావును ఎంపి రేణుకాచౌదరి పరామర్శించారు. ఆరోగ్య యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ మానుకొండ రాధా కిషోర్, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఆర్అండ్‌బిజిఎన్ఆర్‌లో రక్తదాన శిబిరం



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఎన్‌సిసి డే సందర్భంగా ఖమ్మం నగరంలోని ఎస్ఆర్అండ్‌బిజిఎన్ఆర్ కళాశాలలో రక్తదాన శిబిరం నిర్వహించారు. శుక్రవారం ఎన్‌సిసి డేను పురస్కరించుకుని ఎన్‌సిసి 11 తెలంగాణ బెటాలియన్ ఆధ్వర్యంలో నగరంలో రక్తదానంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎస్ఆర్అండ్ బిజిఎన్ఆర్ ప్రభుత్వ కళాశాలలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రి బ్లడ్ బ్యాంక్ సహకారంతో రక్తదానం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్, ప్రొ॥ ఎండి జాకీరుల్లా మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ఆరోగ్య వంతులైన స్త్రీ, పురుషులెవరైనా రక్తదానం చేయవచ్చునని తెలిపారు. ఎన్‌సిసి కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ ఎస్‌కె భద్ర తాను స్వయంగా రక్తదానం చేయడంతో పాటు విద్యార్థులను ప్రోత్సహించారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేస్తూ ఇంకొకరి ప్రాణాలను కాపాడాలని తెలిపారు. ఎన్‌సిసి క్యాండిడెట్స్ ఎప్పుడు సేవ చేయడానికి సిద్ధంగా ఉండాలని తెలిపారు. ఎన్‌సిసి క్యాండిడెట్స్, అధ్యాపకులు, అధికారులు మొత్తం 60 మంది రక్తదానం చేసినట్లు కళాశాల ఎన్‌సిసి ఆఫీసర్ లెఫ్టినెంట్ డా॥ కె. ఓంకార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సిసి అడ్మినిస్ట్రేటీవ్ ఆఫీసర్ కల్నల్ నవీన్‌యాదవ్, జెసివో రాజారాం, కళాశాల అధ్యాపకులు డా॥ బానోత్‌రెడ్డి, కెఎల్ఎన్ శాస్త్రి, డా॥ రమాసత్యవతి, డా॥ విజయ్‌కుమార్, డా॥ కవిత, ఇంద్రాణి, శ్రీనివాస్, డా॥ సునీత, డా॥ పూర్ణచందర్, డా॥ సీతారామారావు తదితరులు పాల్గొన్నారు.

# మాలల సింహగర్జనను జయప్రదం చేయండి

**ప్రజాపక్షం/చింతకాని :** డిశంబర్ 1న సికింద్రాబాద్ జింకానా మైదానంలో జరిగే మాలల సింహగర్జన బహిరంగ సభను జయప్రదం చేయాలని ఇండియన్ మాల లాయర్స్ అసోషియేషన్ ప్రధాన కార్యదర్శి మర్రి ప్రకాష్ కోరారు. శుక్రవారం చింతకాని మండల కేంద్రంలో సభ విజయవంతాన్ని కోరుతూ పోస్టర్‌ను విడుదల చేశారు.ఈ సందర్భంగా మర్రి మాట్లాడుతూ మాలలపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న కుట్రలను తిప్పి కొట్లాలని మాలల అస్థిత్వాన్ని కాపాడుకోవాలన్నారు. ఐక్య పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు.మండలంలోని మాలలు పెద్ద ఎత్తున ఈ సభలో పాల్గొని బహిరంగ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర నాయకులు కొర్లపాటి చిరంజీవి,మండల అధ్యక్షుడు దామాల రవి,నాయకులు పట్టేటి గోపయ్య,గంటెల కిరణ్,ఫణితి యోహాను తదితరులు పాల్గొన్నారు.

## బిటిరోడ్డు నిర్మించాలని రేణుకాచౌదరికి వినతి



**ప్రజాపక్షం/కొణిజర్ల :** మండల పరిదిలోని తుమ్మలపల్లినుంచి కొణిజర్ల వరకు బిటి రోడ్డు నిర్మించాలని రాజ్యసభ సభ్యురాలు , కేంద్ర మాజీ మంత్రి రేణుకాచౌదరికి మాజీ జెడ్పీటిసి దొండపాటి రమేష్ , సిపిఐ నాయకులు కట్ల సత్యం , గడల శ్రీనివాసరావు , కాంగ్రేస్ నాయకులు కమతం నాగేశ్వరరావు శుక్ర వారం వినతిపత్రం సమర్పించారు. ఈ సంద ర్భంగా దొండపాటి రమేష్ మాట్లాడుతు తుమ్మలపల్లినుంచి మండల కేంద్రం కొణిజర్ల రాకపోకలు సాగించడానికి రహదారి బాగో లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఐదు కిలోమీటర్ల మేర రహదారికి బిటి రోడ్డు నిర్మించడంవలన తుమ్మలపల్లి , బోడియాతండా , గణేశ్వరం , అన్నవరం తది తర గ్రామాల ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని తెలిపారు. తుమ్మలపల్లిలో కమ్యూనిటి హాల్ నుంచి అంగన్‌వాడీ స్కూల్ వరకు సీసీ రోడ్డు నిర్మించడానికి ఐదు లక్షల రూపాయలు మంజూరు చేయాలని , కిన్నెర నాగేశ్వరరావు ఇంటినుంచి జెడ్పీ హైస్కూల్ వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి ఐదు లక్షల రూపాయల నిధులు మంజూరు చేయాలని కోరారు.

## మిరప రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



**ప్రజాపక్షం/కొణిజర్ల:** మిరప సాగుచేసే రైతులు మిరపపంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి బాలా జీ తెలిపారు. శుక్రవారం మండల పరిదిలోని చిన్నగోపతి గ్రామంలోని మిరప పంటలను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు వాతావరణ మార్పులు , మబ్బులతో కూడిన వాతావరణం వలన మిరపలో కొమ్మకుల్లుడు బాగా కనిపిస్తుందని అన్నారు. చిరుజల్లులు పడుతున్నప్పుడు సిలీంద్రం బాగా వ్యాప్తి చెందుతుందని అన్నారు. దీనివలన రైతులు ఎక్కువగా నష్టపోయే ప్రమాదం ఉందని తెలిపారు. కొమ్మకుల్లుడు నివా రణకుగాను ఒకరిద్దరు కూలీలతో కొమ్మకుల్లుడు వచ్చిన కొమ్మలను తుంచి ఒక ప్లాస్టిక్ కవ ర్‌లో గాని స్టీల్ గిన్నెలో కాని వేసి చేనుకు దూరంగా వేసి కాల్చాలని పేర్కొన్నారు. ఈకార్య క్రమంలో ఏఈఓ శ్రీనివాసరాజు , చిన్న జీడయ్య, పొట్లపల్లి శ్రీనివాసరావు , అనిల్ , బండారు నరేష్ , ఏ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## బ్రౌన్స్‌లో ఘనంగా ఓరియంటేషన్ ప్రోగ్రాం



**ప్రజాపక్షం/కొణిజర్ల :** మండల పరిదిలోని తనికెళ్ల సమీపంలోగల బ్రౌన్స్ కళాశాల నందు శుక్రవారం ఫార్మసీ విద్యార్థులకు ఓరియంటే షన్ ప్రోగ్రాం నిర్వహించారు. 202425 విద్యా సంవత్సరానికి గాను బిఫార్మసీ , ఫార్మ్ డి కోర్సుల్లో ప్రవేశాన్ని పొందిన నూతన విద్యార్థు లకు ఔషధ శాస్త్రంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా పాల్గొన్న జిల్లా ప్రభుత్వ వైద్యశాల సూప రింటెండెంట్ డాక్టర్ ఎల్ కిరణ్ కుమార్ ఔషధ శాస్త్రం యొక్క ప్రాధాన్యతను వివరించారు. విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించాలని అన్నారు. ఫార్మసీ కోర్సులను అభ్య సించే విద్యార్థులకు వైద్య రంగంలో విస్త్ర ఉపాధి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఈకా ర్యక్రమంలో కళాశాల చైర్మన్ పారుపల్లి ఉషాకిరణ్‌కుమార్ , ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సి పాల్ ప్రొఫెసర్ ఎస్ రాజేశ్వరరావు , కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి జగన్నాథ్ , కళాశాల పరిపాలనాధికారి సిహెచ్ హనుమంతురావు , వివిధ విభాగాధిపతులు , భోధన ,భోదనేతర సిబ్బంది , విద్యార్థిని , విద్యార్థులు పాల్గొన్నారు.

## జేవిఆర్, కిష్టారం ఓసిలలోని సమస్యలను పరిష్కరించండి



**ప్రజాపక్షం/సత్తుపల్లి :** జలగం వెంగళరావు ఓపెన్ కాస్ట్, కిష్టారం ఓపెన్ కాస్ట్, సత్తుపల్లి సిహెచ్‌పి లలో అపరిష్కృతంగా ఉన్న సమ స్యలు పరిష్కరించాలని కోరుతూ ఏఐటీయూసి సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ నాయకులు సింగరేణి అధికారులకు వినతిప త్రాన్ని అందజేశారు.శుక్రవారం ఏఐటీయూసి బ్రాంచ్ జాయింట్ కార్యదర్శి భరణి అధ్య క్షతన సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ సత్తుపల్లి బ్రాంచ్ కార్యవర్గం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సెంట్రల్ ఆర్గనైజ్ కార్యదర్శి వీర స్వామి హాజరైనారు. సమావేశంలో కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై చర్చిం చారు.అనంతరం సింగరేణి అధికారులకు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిప త్రాన్ని అందిజేశారు. ఈ కార్యక్రమంలో బ్రాంచి కార్యదర్శి సముద్రాల సుధాకర్,ఫిట్ కార్య దర్శి నరసింహారావు, కిష్టారం ఫిట్ కార్యదర్శి కిషోర్‌కుమార్, నాగేశ్వరరావు, మోహనము రళి, వీరభద్రు, మోతిలాల్ ,కోటేశ్వరరావు, వినయ్‌కుమార్, నరేందర్, మహేష్, రాంమో హ్మన్, శ్రావణ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

# దళారులకు అండగా సిసిఐ

**-రైతుల పేరుతో దళారుల నుంచి కొనుగోలు**
**-కొనుగోలు కేంద్రంలో భద్రతా ప్రమాణాలు నిల్**





**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** రైతులు ఆరుకాలం కష్టించి పండించిన పంటలను వ్యాపారస్తులు గద్దల్ల వాలి తన్నుకు పోతున్నారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఉన్న వ్యాపారస్తులు గోల్ తండా గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న శ్రీ భాగ్యలక్ష్మి జిన్నింగ్ మిల్లు యజమానులతో సీసీఐ కొనుగోలు కేంద్రం వారితో పరిచయాలు పెంచుకొని రైతుల పండించిన పంటను తక్కువ ధరకు కొనుగోలు చేసి అదే రైతుల పేరు మీద సీసీఐకి అమ్మకాలు పెడుతున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి రైతులకు మద్దతు ధర పెట్టేందుకు తేమ శాతాన్ని బట్టి రేటును నిర్ణయించి ఖమ్మం జిల్లాలో 9 సిసిఐ కొనుగోలు ఏర్పాటు చేశారు. తిరుమలాయపాలెం మండలంలో గోల్ తండా శ్రీ భాగ్యలక్ష్మి జన్నింగ్ మిల్లులో ఏర్పాటు చేయగా జన్నింగ్ మిల్లు యజమానులు సిసిఐ కొనుగోలు కేంద్రం నిర్వాహకులు పత్తి వ్యాపారస్తులు కుమ్మక్కై రైతులు తెచ్చిన పత్తికి ఒక రేటు వ్యాపారస్తులు తెచ్చిన పత్తికి మరొక రేటు పెట్టి రైతులను నిండా ముంచుతున్నారు. రైతులు ఎంతో రవాణా ఖర్చు పెట్టి ప్రతి సిసిఐ కొనుగోలు కేంద్రానికి పంటను తీసుకొస్తే ఎలాంటి ప్రయోజనం లేదని గ్రామాలలోనే పత్తి రైతులు వ్యాపారస్తులకు ప్రతిని విక్రయిస్తున్నారు. రైతు దగ్గర కొనుగోలు చేసిన వ్యాపారస్తుడు రైతు పేరు మీదనే సిసిఐ కొనుగోలు కేంద్రంలో అమ్మకాలు చేపడుతున్నారు. సిసిఐ కొనుగోలు కేంద్రంలో జరుగుతున్న అక్రమాలను అరికట్టి వారిపై చర్య తీసుకోవాలని రైతులు స్థానిక మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని జిల్లా కలెక్టర్ ముజామిల్ ఖాన్ కోరుతున్నారు.

**శ్రీ భాగ్యలక్ష్మి జిన్నింగ్ మిల్లులో పనిచేస్తున్న కార్మికులకు రక్షణ కరువు...**

బతుకుదెరువు కోసం ఇతర రాష్ట్రాల నుంచి జిన్నింగ్ మిల్లులో కొందరు కార్మికులు పనిచేస్తున్నారు. వారికి ఎలాంటి రక్షణ లేదు మహారాష్ట్ర నుంచి వచ్చిన వలస కూలీ జిన్నింగ్ మిల్లు యాజమాన్యం నిర్లక్ష్యం వల్ల మృతి చెందిన సంగతి తెలిసిందే అందులో పని చేస్తున్న వారికి క్షణ తోపాటు భద్రత ప్రమాణాలు పాటించాలని స్థానికులు కోరుతున్నారు.

# సింగరేణి ఆధ్వర్యంలో కొత్త బొగ్గు గనుల ఏర్పాటు

**మంత్రి పొంగులేటికి, ఎంపీ పోరిక బలరాం నాయక్‌కు వినతి పత్రాలు అందజేసిన ఐఎఫ్‌టియు నాయకులు**





**ప్రజా పక్షం/మణుగూరు రూరల్:** మణుగూరు మనుగడకై సింగరేణి ఆధ్వర్యంలో కొత్త బొగ్గు గనుల ఏర్పాటు, ఉన్నగనులకు విస్తరణ అనుమతులు సాధించాలని కోరుతూ పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు సహకారంతో ఐ ఎఫ్ టి యు అధ్యర్యం లో రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కి, మహబూబా బాద్ ఎంపీ పోరిక బలరాంకి శుక్ర వారం వినతి పత్రాలు అందజేసినట్లు ఐఎఫ్ టీ యు అనుబంధ గోదావరిలోయ బొగ్గు గని కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి యస్‌డి. నాసర్ పాషా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలో ప్రస్తుతం బొగ్గు ఉత్పత్తి ప్రక్రియ కొనసాగుతున్న ఓసి గనులు మూత పడనున్నాయని. కొత్త గనులు ప్రారంభం కాకపోతే మణుగూరు ఏరియా మనుగడ ప్రశ్నార్థకం అయ్యే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త గనుల ఏర్పాటుకు సత్వర చర్యలు చేపట్టాలని కోరారు. ఉన్న గనులకు విస్తరణ అనుమతులు సాధించాలని. అన్ని గనులు సింగరేణి ఆధ్వర్యంలోనే నడిపించాలని ప్రజా ప్రతినిధులను కోరినట్లు ఆయన తెలిపారు. మణుగూరుకు వరద ముంపు నివారిస్తూ శాశ్వత పరిష్కారం చూపాలని, ఇటీవల భారీ వర్షాలకు వరద ముంపునకు గురై సర్వం కోల్పోయిన నిరాశ్రయులకు ఇందిరమ్మ పక్కా ఇల్లు నిర్మించాలని కోరారు. అలాగే సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని, సింగ రేణి భూ నిర్వాసితులకు, ప్రభావిత గ్రామాల యువతకు, సింగరేణి డిపెండెంట్ లకు, స్థానికులకు సింగరేణి ఓబి కంపెనీలలో, సెక్యూరిటీ , ఇతర సివిల్ కాంటాక్ట్ పనులలో ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. మణుగూరులో ట్రాఫిక్ నివారణకు ఆటోనగర్ ఏర్పాటు చేయాలని పదవీ విరమణ చేసిన సింగరేణి కార్మికులు ఐదు సెంట్ల భూమిలో గృహ నిర్మాణం చేపడితే ఇబ్బందులు లేకుండా చూడాలని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుడిపూడి కోటేశ్వరరావు, ఎస్ డి హుమాయూన్ తదితరులు పాల్గొన్నారు.

# విజయవంతమైన పోలీస్ శాఖ వైద్య శిబిరం

**వైద్య శిబిరాన్ని ప్రారంభించిన డిఎస్పి రవీందర్ రెడ్డి, డాక్టర్ జయశ్రీ**





**ప్రజా పక్షం/మణుగూరు రూరల్:** మణుగూరు సబ్ డివిజనల్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరం విజయవంతంగా ముగిసింది. అశ్వా పురం, మణుగూరు, పినపాక, కరకగూడెం మండలాల పోలీస్ సిబ్బం దికి, కుటుంబ సభ్యులకు ఆరోగ్య సమస్యలపై వైద్య పరీక్షలు నిర్వహిం చడం జరిగింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ఆదేశా నుసారం మణుగూరు డిఎస్పి రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో భద్రాచలం, మణుగూరు లో ఉన్నటువంటి ప్రముఖ వైద్యులు జనరల్ ఫిజీషియన్ డాక్టర్ శశిధర్, గైనకాలజిస్ట్ డాక్టర్ జయశ్రీ, న్యూరో సర్జన్ డాక్టర్ శ్రావ్య, కార్డియాలజిస్ట్ డాక్టర్ సాయి తేజ రెడ్డి, ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ వీరశేఖర్, యూరాలజిస్ట్ డాక్టర్ హరీష్, అమూల్య ల్యాబ్ టెక్నీషియన్ నరసింహ రావు ల సహకారంతో పోలీసు కుటుంబాలకు, సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించడం జరిగిందని మణుగూరు డిఎస్పి రవీందర్ రెడ్డి విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు విధి నిర్వహణ లో 24 గంటలు వత్తిడి, నేప థ్యంలో పోలీసుల కి అనేకమైన మానసిక శారీరక ఒత్తుడులు ఎక్కువై ఆనారోగ్య సమస్యలు ఎదురవుతాయని తెలిపారు. ఈ సందర్భంగా బిపి, షుగర్, గుండెకు సంబంధించి వ్యాధులు వచ్చి హఠాత్పరిణామాల తో ప్రాణానికే ముప్పు వాటిల్లే ప్రమాదం వాటిల్లవచ్చని గ్రహించి పోలీసు శాఖ ఆధ్వర్యంలో నాలుగు మండలాలలో ఉన్న పోలీసులకు వారి కుటుంబ సభ్యులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం జరిగిం దని తెలిపారు. అలాగే పోలీసు సిబ్బందికి, వారి కుటుంబ సభ్యులకు ఈసీజీ, రక్త పరీక్షలు నిర్వహించి . అనంతరం వైద్యులు తగ సూచనలు చేస్తూ మందులు రాసి ఇచ్చారని తెలిపారు. ఈ సందర్భంగా వైద్య శిబి రానికి పిలవగానే విచ్చేసిన ప్రముఖ వైద్యులందరికీ పోలీసు శాఖ అధి కారులు, సిబ్బంది తరపున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాలుగు మండలాల సిఐలు సతీష్ కుమార్, అశోక్ రెడ్డి, ఎస్సైలు మెద ప్రసాద్, రంజిత్ కుమార్, రాజ్ కుమార్, రాజేందర్, పోలీసు సిబ్బంది కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# సరిహద్దుల్లోకి సన్నాలు..!

**- ఏపి నుండి అడ్డదార్లలో రాష్ట్రంలోకి ధాన్యం**
**- రూ.500 బోనస్ కోసం కక్కుర్తి**



**ప్రజాపక్షం/భద్రాచలం :** తెలంగాణ సరిహద్దుల్లోకి ఏపిలో పండించిన సన్నాలు దొడ్డిదారిన వస్తున్నట్లు తెలుస్తోంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఆనుకుని ఉన్న అశ్వారావుపేట, దమ్మపేట మండలాలు ఉండటంతో అక్రమంగా ఏపి ధాన్యం తెలంగాణలోకి వస్తున్నట్లు సమాచారం. అశ్వా రావుపేట, దమ్మపేట వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినప్పటికీ ఈ రెండు మండలాల్లోనికి అడుగు పెట్టేందుకు అనేకమైన లింకు దార్లు ఉన్నాయి. ఆ దార్లద్వారా తెలంగాణలో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాలకు ఏపి ధాన్యాన్ని అడ్డదార్లలో అమ్ముకునేందుకు తెస్తున్నట్లు పుకార్లు వినవస్తు న్నాయి. అశ్వారావుపేట, దమ్మపేట మండలాలను ఆనుకుని ఏలూరు జిల్లా ఉండటంతో చింతలపూడి, జంగారెడ్డిగూడెం, జీలుగుమిల్లి, కుక్కు నూరు, వేలేరుపాడు మండలాలలకు చెందిన ధాన్యం తెలంగాణలోని వస్తున్నట్లు తెలుస్తోంది.

**రూ.500 బోనస్ కోసం...**

వాస్తవానికి తెలంగాణ ప్రభుత్వం సన్న రకం వరి ధాన్యానికి మద్దతు ధరతో పాటు అదనంగా క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తుండటంతో ఆ రైతులు ఇక్కడ ధాన్యం అమ్ముకునేందుకు మొగ్గు చూపుతున్నట్లు ప్రచారం సాగుతోంది. మరో ప్రక్క వాస్తవంగా వరి సాగు చేసిన పొలాలే కాకుండా ఇంతర పంటలు వేసిన పొలాల్లో కూడా వరి సాగు చేసినట్లు చెబుతూ పట్టాదారు పాస్‌పుస్తకాలను కొనుగోలు కేంద్రాల్లో చూపిస్తూ ఏపి నుండి వచ్చిన ధాన్యాన్ని ఇక్కడి ధాన్యంగా నమోదు చేయించుకుం టున్నట్లు తెలుస్తోంది.

**కళ్లుగప్పి...**

సరిహద్దుల్లోకి అక్రమ ధాన్యం రాకుండా ఉంటేందుకు గత అనుభవా లను దృష్టిలో పెట్టుకుని అధికారులు అశ్వారావుపేట, దమ్మపేట మండ లాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. ఈ చెక్‌పోస్టుల కళ్లుగప్పి కూడా ధాన్యం ఇటు వస్తున్నట్లు తెలుస్తోంది. మరో ప్రక్క వేలేరుపాడు, కుక్కు నూరు, చింతలపూడి, జీలుగుమిల్లి మండలాల నుండి తెలంగాఇ రాష్ట్రం లోనికి అడుగు పెట్టేందుకు చాలా లింకు రోడ్లు ఉన్నాయి. దీంతో వాటిని ఆధారంగా చేసుకుని రాత్రివేళల్లో ధాన్యాన్ని అక్రమంగా తరలిం చుకువచ్చి ఇక్కడ విక్రయాలు సాగిస్తున్నట్లు పుకార్లు వస్తున్నాయి. కొన్ని శాఖల అధికారులు సైతం ఈ అక్రమం ధాన్యం కొనుగోళ్లకు వంత పాడుతున్నట్లు పలువురు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా సంబం ధిత అధికారులు సరిహద్దున్న ఉన్న ఈ రెండు మండలాలపై దృష్టి సారించి, వేసిన వరి పంట ఆధారంగా పట్టాదారు పాస్ పుస్తకాలను పరిశీలిస్తే మంచిదని పలువురు అంటున్నారు.

# 26న జరిగే కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయండి



**ప్రజాపక్షం/పాల్వంచ:** కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా నవంబర్ 26న జరిగే కలెక్టరేట్ ముట్ట డిని జయప్రదం చేయాలని వామపక్ష రైతు, కార్మిక, ప్రజాసంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం ప్రెస్ క్లబ్‌లో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈకార్యక్రమంలో పలు రైతు, కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం అమలు చేస్తున్న నాలుగు కార్మిక కోడ్‌ల వలన కనీస వేతనం ఉద్యోగ భద్రత, సామాజిక భద్రత, ఎనిమిది గంటల పని దినం హక్కులు వంటి హామీలను రద్దు కాబోతున్నాయని, ఈ నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కార్మిక సంఘాలు కొన్ని సంవత్సరాలుగా పోరాడుతున్నాయని గుర్తు చేశారు. బిజెపి ప్రభుత్వం రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘ టిస్తూ ఏడాది నుండి పలు రైతు సంఘాలు పోరాటాలు నిర్వహిస్తున్నా యని తెలిపారు. ఇండియన్ కౌన్సిల్ అగికల్చరర్ రీసెర్చ్ పలు మల్టీ నేష నల్ కార్పొరేట్‌తో వ్యవసాయ పరిశోధనల కోసం అనేక ఒప్పందాలు కుదుర్చుకుందనీ, ప్రభుత్వ రంగంలో ఎఫ్‌సిఐ సెంట్రల్ వేర్ హౌస్ కార్పొరేషన్ మార్కెట్ యార్డులను అదానీ, అంబానీ వంటి కార్పొరేట్ కంపెనీలకు అద్దెకివ్వడం సరికాదన్నారు. 13 నెలల పాటు నిరంతరం సాగిన రైతాంగ ఉద్యమం ప్రభావం వల్ల ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రైతులకు దేశ ప్రజలకు క్షమాపణ చెప్పి రైతు వ్యతిరేక చట్టాలను ఉప సంహరించుకోవడం జరిగిందన్నారు. ఈనెల 26న కలెక్టరేట్ల ముట్టడి కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈకా ర్యక్రమంలో ఏఐకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల విశ్వనాథం, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు దొడ్డ రవికుమార్, ఇఫ్టు జిల్లా నాయ కులు నిమ్మల రాంబాబు, ప్రజాసంఘాల నాయకులు అడుసుమల్లి సాయిబాబా, వీసంశెట్టి పూర్ణచందరావు, బండి నాగేశ్వరరావు, ఉప్పు శెట్టి రాహుల్, గుండాల నాగరాజు, వీ పద్మజ, కొండబోయిన వెంకటే శ్వర్లు, ఇట్టి వెంకట్రావ్, శనగారపు శ్రీనివాసరావు, మద్దుల వీరమోహ నరావు, ఎస్‌ఏ రెహమాన్, వేములపల్లి శేఖర్, భూక్యా విజయ్, కొంగర అప్పారావు, ఎస్‌కే ఖాజా, లాల్ పాషా తదితరులు పాల్గొన్నారు.

## సేవాలాల్ ప్రజారగ్ జోల్ యాత్ర కరపత్రాల ఆవిష్కరణ

**ప్రజాపక్షం/పాల్వంచ టౌన్:**పాల్వంచ మండ లంలోని తోగూడెం గ్రామ పంచాయితీలోని తోగూడెం గ్రామంలో పాల్వంచ మండల అధ్యక్షులు పవన్ కళ్యాణ్ నాయక్ అధ్యక్షతన సేవాలాల్ యువసేన రాష్ట్ర అధ్యక్షులు బాదా వత్ శ్రీను నాయక్ చేతుల మీదుగా ప్రజారగ్ జోళ్ యాత్ర కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలం గాణ రాష్ట్రంలో మొదటి విడతగా నిర్వహించే ప్రజారగ్ జోళ్ యాత్ర తొమ్మిది జిల్లాలలో చేప ట్టడం జరిగిందని, అందులో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మండలం సేవా ఘడ్ సేవాలాల్ మహారాజ్ మందిరం నుండి డిసెంబర్ ఎనిమిదోవ తారీఖున మొదలుకా నుందన్నారు. ఈకార్యక్రమంలో జరుపల బాలకృష్ణ, బాదావత్ రాజా, భూక్యా నాగేశ్వర రావు, ఆంగోతు రాయుడు, జరుపుల బాల కృష్ణ, భూక్యా విష్ణు, బోడ కళ్యాణ్, కేలోత్ రాజ్‌కుమార్, బాధావత్ కళ్యాణి, జరిపుల దేవి, తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ ఫిరాయింపుపై

# ఎంఎల్‌ఏ తెల్లంకు ఊరట

**- అనర్హత పిటిషన్‌పై హైకోర్టు తీర్పు**



**ప్రజాపక్షం/భద్రాచలం :** పార్టీ ఫిరాయింపుపై భద్రా చలం ఎంఎల్‌ఏ డా.తెల్లం వెంకట్రావుపై బిఆర్‌ఎస్ నాయకులుదాఖలు చేసిన కేసులో ఆయనకు ఊరట లభించింది. పార్టీ మారిన ఎంఎల్‌ఏలపై నాలుగు వారాల్లో నిర్ణయం తీసుకోవాలంటూ సింగిల్‌బెంచ్ ధర్మాసనం ఇచ్చిన తీర్పును డివిజన్ బెంచ్ కొట్టేసింది. నిర్ణయం తీసుకునేందుకు శాసనసభా పతికి ఎలాంటి టైం బాండ్ లేదని, సహేతుకమైన సమయంలో నిర్ణయం తీసుకోవచ్చని చెప్పడంతో ఎంఎల్‌ఏ ఊరట లభించింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో బిఆర్‌ఎస్ నుండి పోటీ చేసిన డా.తెల్లం వెంకట్రావు తన సమీప కాంగ్రెస్ అభ్యర్థి పొదెం వీరయ్యపై విజయం సాధించారు. కాగా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోనికి రావడంతో ఎంఎల్‌ఏగా గెలిచిన తెల్లం అనూహ్యంగా కాంగ్రెస్ పార్టీలో చేరారు. దీంతో ఆగ్రహించిన బిఆర్‌ఎస్ నాయకులు డా.తెల్లం వెంకట్రావుతో పాటు మరో ఇద్దరి పై పార్టీ ఫిరాయింపుల చట్టం ప్రకారం కోర్టును ఆశ్రయించారు. కోర్టులో వాదోపవాదనల అనంతరం కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎంఎల్‌ఏ డా.తెల్లంకు ఊరట లభించింది. స్థానిక సంస్థల ఎన్నికల వేళ కాంగ్రెస్ పార్టీకి ఇది సానుకూల అంశమే.

## ఐటిసి పిఎస్‌పిడి గుర్తింపు సంఘం ఎన్నికలను నిర్వహించాలి



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** ఐటిసి పిఎస్‌పిడి గుర్తింపు సంఘం ఎన్నికలను నిర్వహించాలని కోరుతూ ఐటిసి పిఎస్‌పిడి ఏఐటియూసి తెలం గాణ ఎంప్లాయిస్ యూనియన్ ఖమ్మం డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్‌ను కలిసి వినతి పత్రం అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడు తూ గుర్తింపు సంఘం ఎన్నికలను నిర్వహించాల ని కోరారు. ఈకార్యక్రమంలో ఐటిసి పిఎస్‌పిడి ఏఐటియూసి యూనియన్ ప్రధాన కార్యద ర్శి సింగమనేని ప్రసాద్ రావు, ఏఐటియూసి మండల అధ్యక్షులు ఎండి సాజిద్, తెలంగాణ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు తన్నీరు వెంకటేశ్వర్లు, కే కృష్ణమూర్తి పాల్గొన్నారు.

## పాల్వంచ పట్టణ ఫుట్‌పాత్ యూనియన్ సిపిఐ శాఖ సభ్యత్వం పూర్తి



**ప్రజాపక్షం/పాల్వంచ టౌన్:** పాల్వంచ పట్టణ పుట్పాత్ యూనియన్ సిపిఐ శాఖ సభ్యత్వం గుడిపల్లి రవి, భూతం గోపి కిరణ్, ఉప్పుశెట్టి రాకేష్‌లు కలిసి పూర్తి చేశారు. పూర్తి చేసిన సభ్యత్వాలను శుక్రవారం సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం, మండల కార్యదర్శి పూర్ణచందరరావు, పట్టణ కార్యదర్శి అడుసుమిల్లి సాయిబాబులకు అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ త్వరగా సభ్యత్వాలను పూర్తి చేసి అంద జేసినందుకు అభినందించారు. ఈకార్యక్రమంలో గుండాల నాగరాజు, ఏఐటియూసి పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు అన్నారపు వెంకటేశ్వర్లు, ఇట్టి వెంకట్రావు, మన్యం వెంకన్న, శనగారపు శ్రీనివాసరావు, నరహరి నాగేశ్వరరావు, ఆవుల సతీష్, గాదెగాని సత్యనారా యణ, వేములపల్లి శేఖర్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న పాల్వంచ వర్తక సంఘం కన్వీనర్ చలవాది ప్రకాష్



**ప్రజాపక్షం/పాల్వంచ:** పాల్వంచలోని మంచికంటి నగర్ కాలనీలో నిరుపేద వనమా కృష్ణ, కామేశ్వరి దంపతులు ఉన్నారు. వనమా కృష్ణ ఒక పెయింట్ షాప్‌లో పని చేస్తున్నారు. కృష్ణ భార్య కామేశ్వరికి అనుకొని అనారోగ్య సమస్యలు వచ్చాయి. 2021లో క్యాన్స ర్ రావడంతో ఆ క్యాన్సర్‌కు బసవతారకం హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. ప్రస్తుతం మెడిసిన్స్ అవసరాలకు రూ 6వేలు ఖర్చు అవుతున్నాయి. ఇది ఇలా ఉండగా ఇప్పుడు కామేశ్వరికి గాల్బ్లేడర్‌లో రాళ్లు వచచాయి. దీంతో విపరీతమైన కడుపునొప్పితో బాధ పడుతుంది. ఆరోగ్య శ్రీ కార్డు ద్వారా హైదరాబాద్‌లోని నీమ్స్ ఆస్పత్రికి వెళ్లారు. వారు టెస్ట్‌లను చేసి ఈనెల 26వ తేదీన హాస్పటల్‌కి వస్తే ఆపరేషన్ చేస్తామని తెలిపారు. అయితే అక్కడ మందులు కొనడానికి డబ్బులు లేవని తెలియడంతో పాల్వంచ వర్తక సంఘం కన్వీర్ చలవాది ప్రకాష్ స్పందించారు. తన చలవాది ట్రస్ట్ ద్వారా రూ 5వేలను ఆర్థిక సాయం అందించారు. ఇంకా ఏమైనా అవసరం అయితే సాయం అందిస్తామని తెలిపారు.

## ప్రతిఒక్కరిలో సాయం చేసే ఆలోచన రావాలి



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** ప్రతిఒక్కరిలో సహాయం చేసే ఆలోచన రావాలని జమలాపురం యూనియన్ బ్యాంక్ మేనేజర్ డి.వినోద్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని జమలా పురం ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదివే విద్యార్థుల పబ్లిక్ పరీక్షల ఫీజును ఆయన ఆధ్వర్యంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగులవంచ జ్యోతిశ్రీకి శుక్రవారం అందించారు. ఈసందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు తమవంతు సహాయం అందించాలనే ఉద్దేశ్యంతో 13మంది పదో తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షల ఫీజు చెల్లించామని తెలిపారు. మనం చేసే సహాయం ఒక్కరితో ఆగిపోకుండా ఎంతోమందికి స్ఫూర్తి కావాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ఎంతో మంది పేద విద్యార్థులకు చేయూత ఇవ్వాలన్నారు. విద్యార్థులకు జీరో అకౌంట్‌తో అకౌం ట్‌లు అందించామని, ఎవరైనా అకౌంట్ కావాలనుకునే వారు బ్యాంక్‌కు తమ ఆధార్ కార్డుతో వచ్చి అకౌంట్ చేసుకోవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ స్పెషల్ అసిస్టెంట్ కె.ముఖేష్, డిప్యూటీ మేనేజర్ ప్రదీప్‌కుమార్, క్యాషియర్ ఎల్.రవికుమార్, బ్యాంక్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ముగ్గురు డిడిల వ్యవస్థ అక్రమ లోపాల పుట్ట

**-అవస్థల నిలయంగా సంక్షేమ హాస్టళ్లు**
**-సమస్యల పరిష్కారం కోరుతూ**
**కలెక్టరేట్ వద్ద ఏఐఎస్ఎఫ్ నిద్ర**
**-భగ్నం చేసిన పోలీసులు**






**ప్రజాపక్షం/ఖమ్మం :** సంక్షేమ శాఖలో ముగ్గురు డిడిల వ్యవస్థ అక్రమ లోపాల పుట్టగా మారిందని తద్వారా విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ ఆరోపించారు. వసతి గృహాలు సౌకర్య లేమితో విద్యార్థులు నానా ఇబ్బందులు పడుతున్నారని ఆయన తెలిపారు. హాస్టల్ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో హాస్టల్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట రాత్రి నిద్ర నిరసన కార్యక్రమానికి పిలుపునిచ్చారు. పోలీసులు ఈ కార్యక్రమాన్ని భగ్నం చేశారు. ఏఐఎస్ఎఫ్ నాయకులను బలవంతంగా తొలగించి అక్కడి నుంచి పంపించేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ఏ హాస్టల్‌కు వెళ్లినా అరకొర సౌకర్యాలతో విద్యార్థులు కాలం వెళ్లదీస్తున్నారని జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్న హాస్టల్ సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. డిడిలు జిల్లా స్థాయి ఉన్నతాధికారులను తప్పదోవ పట్టిస్తున్నారని దీనివల్ల సంక్షేమం సంక్షోభంలోకి కూరుకుపోయిందని ఆయన తెలిపారు. చలికాలం సమీపించి 15 రోజులు కావస్తున్నా దుప్పట్లు రాలేదని రామకృష్ణ తెలిపారు. హాస్టళ్లపై డిడిల పర్యవేక్షణ లోపం కారణంగా వసతి గృహాలు విద్యార్థుల పాలిట మురికి కూపాలుగా తయారయ్యాయని ఆయన తెలిపారు. హాస్టల్ విద్యార్థుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, కాస్మోటిక్ ఛార్జీలను పెంచాలన్నారు. సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మడుపల్లి లక్ష్మణ్, నాయకులు షేక్ నాగులమీరా, మధు, శివనాయక్, మనోజ్, హరికృష్ణ ప్రతాప్, బాలాజీ, సుభాష్, సునీల్, రోహిత్, మహేష్, ధోనీ, రాజు, పవన్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# కొర్రీలు పెట్టకుండా పత్తిని కొనుగోలు చేయాలి



**ప్రజాపక్షం/ తల్లాడ :** రైతులు సిసిఐ కేంద్రానికి తీసుకువచ్చిన పత్తిని కొర్రీలు పెట్టకుండా కొనుగోలు చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా నాయకులు శీలం సత్యనారాయణరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం తల్లాడలోని సిసిఐ కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తెచ్చిన పత్తిని మాయిశ్చరైజింగ్ ఎక్కువగా ఉందని రిజెక్ట్ చేస్తున్నారని ఆరోపించారు. తేమశాతం కొలిచే పరికరంలో లోపం ఉందని ఎక్కువ శాతం చూపిస్తుందని ఆరోపించారు. రైతులను ఇబ్బందులకు గురిచేసి దళారులు పత్తిని కొనుగోలు చేస్తూ రైతులను తీవ్రంగా నష్టపరుస్తున్నారన్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రైతులకు అందటం లేదన్నారు. దళారులు సిబ్బంది లోపాయికారి ఒప్పందాలు చేసుకుని రైతులను నిలువునా ముంచుతున్నారన్నారు. రైతుల పత్తిని కొనుగోలు చేయాలని, రైతులను ఇబ్బందులకు గురి చేస్తే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు అయినాల రామలింగేశ్వరరావు, చల్లా నాగేశ్వరరావు, నరేష్ పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



**ప్రజాపక్షం/ తల్లాడ :** తల్లాడ మండలంలోని గోపాలపేట గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తల్లాడ సొసైటీ చైర్మన్ రెడ్డెం మోహన్ రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి దొడ్డ శ్రీనివాసరావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కొమ్మినేని వెంకటేశ్వరరావు, నల్లమోతు మోహన్ రావు, టిడిపి మండల అధ్యక్షలు కూచిపూడి వెంకటేశ్వరావు, కొమ్మినేని శ్రీను, తిరుమలరావు, పొన్నం కృష్ణయ్య, గోవిందు శ్రీనివాసరావు, చల్లగుండ్ల కృష్ణ, మారెళ్ళ దేవందర్, కోసూరు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# వందశాతం ఫలితాలు రావాలి : ఐటిడిఏ పిఓ



**ప్రజాపక్షం/భద్రాచలం :** గిరిజన విద్యాలయాల్లో చదువుతున్న పిల్లలకు చక్కటి పౌష్టికాహారంతో పాటు మంచిగా చదువులు చెప్పి గతం కంటే ఈ సారి వంద శాతం ఫలితాలు సాధించాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ అన్నారు. శుక్రవారం ఐటిడిఏ సమావేశ మందిరంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని గురుకులాలు, ఆశ్రమ పాఠశాలల హెచ్ఎంలు, వార్డెన్లు, ప్రధానోపాధ్యాయులు, ఫ్యాకల్టీలు, సబ్జెక్టుల ఉపాధ్యాయుల వీడియో కాన్ఫిరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిల్లలకు చక్కటి పౌష్టికారాన్ని అందించడంతో పాటు చదువులపై శ్రద్ద వచ్చేలా చర్యలు తీసుకుని నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలన్నారు. నాసిరక వస్తువులను వంటలకు వాడితే సహించేది లేదని, అన్నీ తాజా వస్తువులు వినియోగించాలన్నారు. వంట పదార్ధాలు తనిఖీ చేసిన తర్వాతే పిల్లలకు పెట్టాలన్నారు. రాష్టలోని పలు ప్రాంతాల్లో నాసిరక వస్తువుల వల్ల అనారోగ్యాల పాలయ్యారని చెప్పారు. విద్యార్థుల పట్ల అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని, పిల్లల హాజరు శాతం సరిగా ఉండాల చూడాలన్నారు. జిసిసి వారు ఆహార పదార్ధాలు కాలం చెల్లిన వాటిని సరఫరా చేయవద్దని అన్నారు. ఉపాధ్యాయులు డెప్యుటేషన్లు కోరుకున్న చోటికి ఉండవని, నాలుగు నెలల పాటు పిల్లల చదువులపై దృష్టిసారించాలన్నారు. సబ్జెక్టుల టీచర్లు సెలువులు పెట్టవద్దని, పెడితే వారి స్థానంలో వేరేవారిని ప్రిన్సిపళ్లు నియమించాలని ఆదేశించారు. గిరిజన విద్యార్థుల పట్ల అంతా అప్రమత్తంగా ఉండాలని, చలి కాలంలో పిల్లల పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిడి మణెమ్మ, గురుకులం ఆర్‌సిఓ నాగార్జున రావు, జిసిసి డిఎం సమ్మయ్య, ఏసిఎంఓ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

# ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన ఆర్టీసి బస్సు

**-ఒకరు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు**



**ప్రజాపక్షం/కొణిజర్ల :** ఆర్టీసి బస్సు ద్విచక్ర వాహనాన్ని ఢీకొని ఒకరు మృతిచెందగా మరొకరికి తీవ్రగాయాలైన సంఘటన మండల పరిదిలోని పల్లిపాడు వద్ద శుక్రరం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం వైరా మండలం వల్లాపురం గ్రామానికి చెందిన కటికల సిల్వరాజు (38) కటికల శోభన్‌బాబు ద్విచక్రవాహనంపై వల్లాపురం నుంచి ఖమ్మం వెళుతున్నారు. పల్లిపాడు సమీపంలోకి రాగానే కొత్తగూడెం డిపోకు చెందిన బస్సు ఖమ్మం వైపు నుంచి భద్రాచలం వెళుతు ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సంఘటనాస్థలంలోనే సిల్వరాజు మృతిచెందగా శోభన్‌బాబు కు తీవ్రగాయలయ్యాయి. క్షతగాత్రుణ్ని 108 లో ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. మృతునికి భార్య దేవమని , కుమారుడు సాత్విక్ , కుమార్తె హర్షిత ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రజాపాలన ప్రచార రధాలు ప్రారంభం

**ప్రజాపక్షం/భద్రాచలం :** రాష్ట్ర ప్రభుత్వం ఏడాది పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాలను విస్తృతంగా ప్రజలకు వివరించేందుకు ప్రజాపాలన రధాలను శుక్రవారం ప్రారంభించారు. వీటిని ఇల్లెందు మున్సిపాలిటీ పరిధిలో మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, సుజాతనగర్ మండల పరిధిలో తహశిల్దార్ శిరీషా ప్రారంభించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక మండల కళాజా బృంధాలు రాష్ట్ర ప్రభుత్వం పథకాలను ఆట పాటలతో ప్రదర్శనలు ఇస్తూ ప్రజలకు వివరిస్తారు.

# వైద్యుల సూచనల మేరకే మందులను వాడాలి



**ప్రజాపక్షం/బోనకల్:** వైద్యుల సూచనల మేరకే మందులను వాడాలని మండల వైద్యాధికారి వేముల స్రవంతి అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో యాంటీ బయోటిక్ మందులపై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. పిహెచ్‌సి వచ్చిన పేషంట్లకు యాంటీ బయోటిక్ మందులు వాడే విధానం, జాగ్రత్తలకు గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. యాంటీ బయోటిక్ మందులు కేవలం వైద్యులు రాసే ప్రిస్కిప్షన్ మేరకే వాడాలని సూచించారు. ఐదు రోజులు, ఏడు రోజులు, పద్నాలుగు రోజులు ఇలా వైద్యుల సూచించిన రోజులు మాత్రమే వాడాలని తెలిపారు. కోర్సు మధ్యలో ఆపివేసిన యాంటీబయోటిక్ మందులు పనిచేయకపోగా వ్యాధి తీవ్రత పెరుగుతుందని హెచ్చరించారు. యాంటీ బయోటిక్ మందులు దుర్వినియోగం అవుతే యాంటీ బయోటిక్ రెసిస్టెంట్ ఏర్పడుతుందని, తద్వారా ఆ మందు ఎప్పటికి పనిచేయదని అన్నారు. ఒకరు వాడిన యాంటీబయోటిక్ మందులు మిగిలాయని అదే లక్షణాలతో ఉన్న మరో వ్యక్తి వాడడం అనేది ప్రమాదకరమని అన్నారు. వ్యాధి చిన్నదైనా, పెద్దదైనా తప్పనిసరిగా వైద్యులు సంప్రదించిన తర్వాతనే మందులు వాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ శ్రీనివాసరావు, నర్సింగ్ ఆఫీసర్ ఉదయశ్రీ, ల్యాబ్ టెక్నిషియన్ యాకుబ్, చంద్రశేఖర్, పార్మసిస్టు పద్మాలత, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# రేణుకాచౌదరికి స్వాగతం పలికిన కట్ల రంగారావు




**ప్రజాపక్షం/వైరా :** కేంద్ర మాజీ మంత్రి వర్యులు , ప్రస్తుత రాజ్యసభసభ్యురాలు రేణుకా చౌదరిని ఖమ్మం జిల్లా పర్యటనలో భాగంగా సూర్యాపేట సెవెన్ హోటల్లో నందు టిపిసి కార్యదర్శి కట్ల రంగారావు , కాంగ్రెస్‌పార్టీ నాయకులు కట్ల సంతోష్ , రేచర్ల నాగేశ్వరరావు కలిశారు. పార్టీ పనితీరు ప్రజల్లో ప్రభుత్వం ఉన్న విశ్వాసాన్ని ఆమె అడిగి తెలుసుకున్నారు.

# పంచాయతీ కార్యదర్శుల నూతన కార్యవర్గం ఏర్పాటు



**ప్రజాపక్షం/వైరా :** వైరా మండల పంచాయతీ కార్యదర్శుల సమావేశం మండల పరిషత్ కార్యాలయంనందు జరిగింది. ఈ సమావేశంలో అన్ని పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు. నూతన పంచాయతీ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వరికూటి సురేష్ (గరికపాడు) గౌరవ అధ్యక్షుడిగా చిట్టిపోతుల వెంకటేశ్వరరావు (గన్నవరం) ఉపాధ్యక్షుడు వేమా ప్రతిషోత్తంరావు, కోటా సునీత , ప్రధాన కార్యదర్శి కర్నాటి హేమలత , కోశాధికారి ఉబ్బన లక్ష్మణ్‌రావు , కార్యవర్గ సబ్యు లు ఆర్ భారతీ , జూపూడి అజయ్‌కుమార్ , కె నిర్మల, చిన్న వెంకట్రావమ్మ, రవీంద్ర యాదవ్ , మానస భవాని , అనూషా, హెచ్‌వి ప్రసాద్ , సిహెచ్ నాగేశ్వరరావు , ఎం కృష్ణయ్య, అరుణ , శ్రీలత లను ఎన్నుకున్నారు.

# వరిదుబ్బులు కాల్చడం వల్ల భూమిలో ఉండే సాంద్రత తగ్గుతుంది



**ప్రజాపక్షం/వైరా :** రైతులు పొలంలోని వరిదుబ్బులు కాల్చడంవలన భూమిలో ఉండే కార్బన్ శాతం తగ్గి భూమి సారవంతం కోల్పోతుందని నేల కూడా గుల్ల బారుతుందని రైతులు ఎవరు వరి దుబ్బులను కాల్చవద్దని వైరా మండల వ్యవసాయ అధికారి మంజుఖాన్ తెలిపారు. శుక్రవారం ఆయన ఏఈఓ వాసంతితో కలిసి అష్ణగుర్తిలో పొలాల వద్దకు వెళ్లి రైతులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు వరిదుబ్బులను భూమిలోనే కలియదున్నడం వలన నేల సారవంతం పెరిగుతుందని తెలిపారు. దుబ్బులు కుళ్లడం కొరకు సూపర్ ఫాస్ట్ వాడాల్సిందిగా తెలిపారు. ఈకార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

# రైతులకు బేడీలు వేసిన చరిత్ర బిఆర్ఎస్‌ది..



**-కాంగ్రెస్ పాలనలో అభివృద్ధిలో అగ్రస్థానానికి తెలంగాణ**
**-మీడియా సమావేశంలో రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి**

**ప్రజాపక్షం/ఖమ్మం :** గిట్టుబాటు ధర అడిగిన రైతుల చేతులకు బేడీలు వేసిన చరిత్ర బిఆర్ఎస్ పార్టీదని అటువంటి పార్టీ ఇప్పుడు రైతుల గురించి మాట్లాడడం శోచనీయమని రాజ్యసభ సభ్యురాలు, మాజీ కేంద్ర మంత్రి రేణుకాచౌదరి తెలిపారు. ఇటీవల వరకు కుక్కినపేనులా ఉన్నవారు ఇప్పుడు రైతుల గురించి మాట్లాడుతున్నారని వాస్తవాలు తెలియకుండా ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఆమె ఆరోపించారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రేణుకాచౌదరి మాట్లాడుతూ రాష్ట్రాన్ని బిఆర్ఎస్ అప్పుల పాలు చేసిందని ఇప్పుడు ఏదో చేయలేదని గగ్గోలు పెడుతున్నారని కాని పదేళ్ల కాలంలో వారు ఏమి చేశారని రేణుకాచౌదరి ప్రశ్నించారు. గుట్టలు మింగారని ఇప్పుడు నీతులు చెబుతున్నారని ఆమె ఆరోపించారు. బిఆర్ఎస్ ప్రతిపక్ష పాత్ర నిర్వహించడం లేదని బిఆర్ఎస్ నాయకులు వ్యవహరిస్తున్న తీరు ప్రతిపక్ష పాత్ర కాదన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రిని, ఖమ్మంజిల్లాకు చెందిన మంత్రులను విమర్శించడం సరైంది కాదన్నారు. మహిళలు ఆనందంగా ఉన్నారని ఉచిత బస్సు ప్రయాణం సహా పలు కార్యక్రమాలు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ముందుకు తెచ్చిందన్నారు. మీడియా సమావేశంలో మేయర్ పునుకొల్లు నీరజ, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, కాంగ్రెస్ నాయకులు మానుకొండ రాధాకిషోర్, పలువురు కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

# ట్రాన్స్‌జెండర్‌లు ఆత్మ గౌరవంతో జీవించాలి

**-స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేసుకోవాలి**
**-ఖమ్మంలో ట్రాన్స్‌జెండర్‌లచే స్త్రీ టీ స్టాల్స్ ఏర్పాటు**
**-ట్రాన్స్‌జెండర్‌లతో జిల్లా కలెక్టర్ సమావేశం**





**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ట్రాన్స్‌జెండర్‌లు ఆత్మ గౌరవంతో జీవించేందుకు సంపూర్ణ సహకారం అందిస్తామని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. శుక్రవారం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ డా॥ పి. శ్రీజతో కలిసి ట్రాన్స్‌జెండర్‌లతో సమావేశం నిర్వహించారు. ట్రాన్స్‌జెండర్‌లకు ఆధార్ కార్డు జారీ, పేరు మార్పు విధానం, అర్హులైన వారికి రేషన్‌కార్డు, పెన్షన్, నూతన ఎస్‌హెచ్‌జిల ఏర్పాటు తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ట్రాన్స్‌జెండర్‌ల సంక్షేమానికి చర్యలు చేపడతామన్నారు. ఆధార్‌కార్డు లేనివారికి ఆధార్ కార్డుల జారీకి చర్యలు తీసుకోవాలన్నారు. రేషన్ కార్డుల కోసం ట్రాన్స్‌జెండర్‌లు దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం నూతన రేషన్‌కార్డుల మంజూరు సమయంలో అర్హులైన వారికి కార్డులను అందిస్తామని కలెక్టర్ తెలిపారు. ట్రాన్స్‌జెండర్‌లకు ప్రత్యేకంగా ప్రభుత్వం నుండి ఎటువంటి పెన్షన్ పథకం లేదని ఒంటరి మహిళల కోటా క్రింద పింఛన్ మంజూరుకు దరఖాస్తు సమర్పిస్తే మంజూరుకు చర్యలు చేపట్టనున్నట్లు కలెక్టర్ తెలిపారు. స్వశక్తి మహిళా సంఘాల తరహాలో ట్రాన్స్‌జెండర్‌లు సంఘాలుగా ఏర్పడితే వ్యాపార యూనిట్ల ఏర్పాటుకు రుణాలు అందిస్తామన్నారు. ఖమ్మం నగరంలో 13 చోట్ల స్త్రీ టీ స్టాల్స్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వాటిలో రెండు చోట్ల ట్రాన్స్ జెండర్‌లకు అవకాశం కల్పిస్తామని, మరో నాలుగు ఇతర వ్యాపార యూనిట్ల ఏర్పాటుకు సహకారం అందిస్తామన్నారు. ట్రాన్స్‌జెండర్‌లు చర్చించుకుని ఎటువంటి వ్యాపారం ప్రారంభించాలో ఆలోచించుకోవాలని కలెక్టర్ సూచించారు. ట్రాన్స్‌జెండర్‌లకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరుకు కృషి చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి కె. రాంగోపాల్‌రెడ్డి, డిఆర్‌డివో ఎస్. సన్యాసయ్య, డిఆర్‌వో రాజేశ్వరి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీలు చేయాలి




**ప్రజాపక్షం/లక్ష్మీ దేవిపల్లి:** శుక్రవారం కొత్తగూడెంలోని స్థానిక శేషగిరిభవన్ నందు కిసాన్ సంయుక్త మోర్చా పలు రైతు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఐకెఎంఎస్ జిల్లా సహాయ కార్యదర్శిచంద్రగిరి శ్రీనివాసరావు ముఖ్య అతిధిగా పాల్గొని ఆయన మాట్లాడుతూ దేశంలో బిజెపి ప్రభుత్వం రైతుల కార్మికుల పట్ల నిరంకుశ ధోరణిని అవలంభిస్తుదని అన్నారు. పంట ఖర్చులు పెరుగుతున్న 12 నుంచి 15% కంటే అధికంగా ద్రవ్యోల్బణం పరిస్థితుల్లో నిత్యవసర వస్తువులను కొనుగోలు చేయలేని దుస్థిని కొనసాగుతుందన్నారు. 2024–25 సంవత్సరానికి 5.35% పెంచి వరి క్వింటాలకు రూ.2300లు మద్దతు ధరలను నిర్ణయించిందని అన్నారు. రైతుల డిమాండ్ ప్రకారం సిటు ప్లస్ 50 పంటల పెట్టుబడి ఖర్చుకు ఆధారంగా 50% కలిపి మద్దతు ధరలను పెంచడం లేదని, మద్దతు ధరలను నిర్ణయించడం లేదని ఆయన అన్నారు. 2019లో కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయడం ద్వారా రాజ్యాంగంలోని ఫెడరల్ స్ఫూర్తికి భంగం కలిగించారని, రాష్ట్ర ప్రభుత్వాల హక్కుగా రావాల్సిన వాటాలను తగిచి రాష్ట్ర ప్రభుత్వాలకు అన్యాయం చేశారన్నారు. రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ 2020 నవంబర్ 26న వేలాది ట్రాక్టర్లతో లక్షలాది మంది రైతులు ఢిల్లీలో ప్రదర్శన నిర్వహించాని ఆయన గుర్తు చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల పట్ల నిరంకుశ ధోరణిని అవలంభిస్తున్న కారణంగానే సంయుక్త కిసాన్ మోర్చా సెంట్రల్ ట్రేడ్ యూనియన్ల ఆధ్వర్యంలో ఈనెల23న బైక్ ర్యాలీ, 26న కలెక్టరేట్ల ముట్టడి కార్యక్రమాలను నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు కంచర్ల జమలయ్య, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు దారా శ్రీనివాస్, కోబల్, రవికిరణ్, శ్రీనివాస్, టియుసిఐ జిల్లా నాయకులు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## మండల వ్యాప్తంగా మాయమవుతున్న చెరువులను పరిరక్షించాలి

**ప్రజాపక్షం/జూలూరుపాడు:** మండల వ్యాప్తంగా మాయమవుతున్న చెరువులను పరిరక్షించాలని మాలమహానాడు జూలూరుపాడు మండల అధ్యక్షులు బడుగు వీరస్వామి అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన జూలూరుపాడులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా చెరువులు కుంటలు ఆగమవుతున్నాయి వాటిని పరిరక్షించాల్సిన బాధ్యత మండల రెవెన్యూ ఇరిగేషన్ అధికారులపై ఉండగా అధికారులు మాకు సంబంధం లేదు మాకు సంబంధం లేదు అంటూ మాట దాటేస్తున్నారు తప్ప సమస్యకు పరిష్కారం చూపట్లేదు అని అన్నారు. రోజురోజుకు చెరువులు ఆక్రమణకు గురై నీరు నిలిచే అంత విస్తరణ లేక చెరువులు బోసిపోతూ ఉండగా రైతులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తూ ఉందని ఆయన అన్నారు. ఎవరికివారు మాకు సంబంధం లేదు అంటూ దాటేకుండా ఇప్పటికైనా చెరువులను సర్వే చేసి హద్దులు నిర్మించకుంటే రైతులే కాక భూగర్భ జలాలు కూడా అంతరించిపోయే అవకాశం ఉంది కావున తక్షణమే మండల వ్యాప్తంగా ఉన్న చెరువులను పరిరక్షించాలని ఆయన అన్నారు.

## జిల్లాస్థాయి చెకుముఖి టాలెంట్ టెస్టుకు ఎంపికైన మహాదేవపురం విద్యార్థులు



**ప్రజాపక్షం/ మధిర :** జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జరిగిన మధిర మండల స్థాయి చెకుముఖి టాలెంట్ టెస్టులో మహాదేవపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చి జిల్లాస్థాయి టాలెంట్ టెస్టుకు ఎంపికైనట్లు హెచ్ఎం సాధుసమాధానం తెలిపారు. శుక్రవారం పాఠశాలలో జరిగిన అభినందన సభలో హెచ్ఎం మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులు ఒరుగు సంధ్యారాణి, బట్టా కీర్తి, మర్సకట్ల త్రివేణి మండలస్థాయి టాలెంట్ టెస్టులో ప్రతిభ చూపి పాఠశాలను మొదటిస్థానం నిలిపారన్నారు. ఈ నెల 28న ఖమ్మంలో జరిగే జిల్లాస్థాయి టాలెంట్ టెస్టులో కూడా ఇదే ప్రతిభ చూపి పాఠశాలకు మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పిపిసి చెక్‌పోస్టును తనిఖీ చేసిన ఆర్‌డిఓ



**ప్రజాపక్షం/ మధిర :** మండల పరిధిలోని మాటూరు క్రాస్ రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన పిపిసి చెక్ పోస్టును శుక్రవారం ఖమ్మం ఆర్‌డిఓ జి. నర్సింహారావు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధాన్యం తరలించే రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. తెలంగాణ సరిహద్దు ప్రాంతంగా ఉన్న మధిర మండలంలో అక్రమ ధాన్యం రవాణాను నియంత్రించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మధిర తహశీల్దార్ రాంబాబు, ఎంపిడిఓ వెంకటేశ్వర్లు, ఇతర రెవెన్యూ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



**ప్రజాపక్షం/ మధిర :** మధిర పట్టణ పరిధిలో ఎవరైనా ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని మధిర టౌన్ ఎస్సై సంధ్య హెచ్చరించారు. శుక్రవారం మధిర పట్టణంలోని ప్రధాన కూడళ్లల్లో ట్రాఫిక్ నియమ నిబంధనలకు విరుద్ధంగా రోడ్లపై నిలిపిన వాహనాలకు జరిమానాలు విధించారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించే విధంగా ప్రధాన కూడళ్లల్లో వాహనాలు ఎక్కడ పడితే అక్కడ నిలుపురాదని, ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించాలని సూచించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే విధంగా వాహనాలు నిలిపితే వాహనాలు సీజు చేసి కేసులు నమోదు చేయటం జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుళ్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



**ప్రజాపక్షం/పెనుబల్లి:** పెనుబల్లి మండలం కర్రాలపాడు గ్రామంలో డీసీఎంఎస్ సన్నరకం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం కల్లూరు మార్కెట్ కమిటీ చైర్మన్ నీరజ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ప్రతాప్, ఎఎంసీ వైస్ చైర్మన్ రాజబోయిన కోటేశ్వరరావు, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు , చీకటి రామారావు, పంది వెంకటేశ్వరావు, ఆళ్ల నరేంద్ర, గ్రామ నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## 27న జరిగే విద్యార్థుల సదస్సును జయప్రదం చేయండి

**ప్రజాపక్షం/సత్తుపల్లి :** ఈ నెల 27న ఖమ్మంలో జరిగే హలో మాదిగ విద్యార్థి, చలో ఖమ్మం విద్యార్థుల సదస్సును జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు ఖమ్మం జిల్లా నాయకులు ఊటుకూరి రత్నాకర్ మాదిగ. శుక్రవారం ఎంఎస్ఎఫ్ మండల సమావేశం పట్టణంలోని తేజ ఒకేషనల్ కాలేజీలో నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్య అతిదిగా రత్నాకర్ హజరై మాట్లాడుతూ అగస్ట్ 1న ఎస్సీల వర్గీకరణ చేసుకునే అధికారం రాష్ట్రాలకు ఉందని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన నేపధ్యంలో ,తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి దేశంలో అన్ని రాష్ట్రాల కంటే తెలంగాణలో ముందవుతుందని మాట ఇచ్చి మూడు నెలలు గడుస్తున్న ఇంకా కమీటీల పేరుతో కాలయాపన చేస్తూ వర్గీకరణ వ్యతిరేక శక్తులకు తలొగ్గి వర్గీకరణ చేయకుండా మాదిగ కులానికి అన్యాయం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి నిరసనగా ఈ నెల 27న ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా విద్యార్థుల సదస్సును ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సదస్సుకు ముఖ్య అతిధిగా ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అద్యక్షుడు మందాకృష్ణ మాదిగ వస్తున్నారని కావునా విద్యార్థులంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ముత్తారావు మాదిగ, శ్రీనివాసరావు మాదిగ, పరిగడుపు లక్ష్మణ్ మాదిగ, దేవన్నమాదిగ, రమేష్ మాదిగ, కొత్తపల్లి సాయికుమార్‌మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## కళ్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీ

**ప్రజాపక్షం/చింతకాని :** చింతకాని మండలంలో వివిధ గ్రామలకు చెందిన లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మీ ,షాదీముభారక్ చెక్కులను శుక్రవారం చింతకాని తహసీల్దార్ కూరపాటి అనంతరాజు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ అనంతరాజు మాట్లాడుతూ 43 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం నుండి మంజూరైన చెక్కులు పంపిణీ చేస్తున్నామన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గిర్ధావర్‌లు రఘు,జయకృష్ణ,రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# నిరుపయోగంగా క్రీడా ప్రాంగణాలు..!

**ప్రజాపక్షం/బోనకల్‌:** గ్రామీణ ప్రాంతాల్లో యువతను, క్రీడాకారులను ప్రోత్సహిస్తూ.. వారిలోని నైపుణ్యాలను వెలికి తీసి, క్రీడల్లో రాణించేందుకు వీలుగా గత ప్రభుత్వం మండలంలోని 22 గ్రామ పంచాయతీలలో 22 క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసింది. వీటి నిర్వహణ లేకపోవడం, క్రీడా సామాగ్రి జాడలేకపోవడంతో నిరూపయోగంగా మారాయి. మండలంలోని 22 క్రీడా ప్రాంగణాలకు డిస్ట్రిక్ స్పోర్ట్స్ ఆథారిటీ నుంచి వాలీబాల్, క్రికెట్, షార్ట్‌పుట్, త్రోబాల్, ఇతరత్ర క్రీడా సామాగ్రిని అందజేశారు. ఇవి క్రీడా ప్రాంగణాలకు అందుబాటులో ఉంచపోగా వీటి జాడలేకుండా పోయింది. దీంతో క్రీడా ప్రాంగణాలు నిర్వహణలోపంతో పాటు వెళ్లేందుకు సరైన దారులు లేకపోవడం, చాలా ప్రాంగణాలు చెట్లు, పిచ్చిమొక్కలతో అధ్వానంగా మారి కనీసం అడుగుపెట్టేందుకు కూడా వీలుపడకుండా ఉండడంతో అవి నిరూపయోగం మారాయి. బోర్డులు తగిలించిన కనీస సౌకర్యాలు, శిక్షణ ఇచ్చేందుకు శిక్షకుల ఏర్పాటు వంటివి లేకపోవడంతో క్రీడా మైదానాలు నిరూపయోగంగా మారాయి. కొన్ని క్రీడా మైదానాల్లో రెండు పోల్స్, ఎక్సర్‌సైజ్ బార్‌లను ఏర్పాటు చేసి వదిలేశారు. ఆటలు ఆడే పరిస్థితి లేదు. క్రీడా మైదానాల నిర్వహణను పట్టించుకోకపోవడంతో అలంకారంగా మారాయి. క్రీడా మైదానాలకు కేటాయించిన ధనం వృధ్ధా అయిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.




**క్రీడా ప్రాంగణాలలో వసతులు కల్పించాలి.**
**అమరేసి లింగయ్య, బాల్‌బాడ్మీంటన్ కోచ్, బోనకల్.**



క్రీడా ప్రాంగణాలలో వసతులు కల్పించడం తోపాటు క్రీడా ప్రాంగణాలలో క్రీడా సామాగ్రి అందుబాటులో తీసుకురావాలి. ప్రభుత్వమే గ్రామ క్రీడ కమిటీలు ఎర్పాటు చేసి క్రీడలపై యువత, విద్యార్థులు ఆసక్తి చూపేలా చర్యలు తీసుకోవాలి. క్రీడా దినోత్సవం, ఇతర కార్యక్రమాలకు క్రీడా పోటీలు నిర్వహించాలి. క్రీడాకారులకు ప్రోత్సాహం అందించాలి. గ్రామ పంచాయతీ అధికారులు క్రీడాప్రాంగణాలపై ప్రత్యేక దృష్టి సారించి నిత్యం నిర్వహణలో ఉండేలా చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వం ప్రాంగణాలకు బాధ్యులను ఏర్పాటు చేసి, నీటి వసతి, ఇతర సదుపాయాలు ఏర్పాటు చేయాలి.

**క్రీడ సామగ్రిని అందుబాటులో ఉంచాలి.**
**గుంపుల మనీష్, ఏఐవైఎఫ్ మండల కన్వీనర్**



యువతను చెడు వ్యసనాల బారిన పడకుండా అధికారులు చోరవ చూపాలి. క్రీడ ప్రాంగణాలలో క్రీడా సామాగ్రిని అందుబాటులో ఉంచాలి. యువతను క్రీడల వైపు మొగ్గు చూపేలా క్రీడలపై ఆసక్తి కలిగించేలా తల్లిదండ్రులు కూడా ప్రోత్సహించాలి. క్రీడ ప్రాంగణాలను ఎప్పటికప్పుడు శుభ్రం పరుస్తూ నిర్వహణ ఉండేలా చర్యలు తీసుకోవాలి. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు అదరించాలి. క్రీడ ప్రాంగణంలో సిబ్బంది నియమించి, క్రీడాకారులకు నీరు, ఇతరత్ర సౌకర్యాలు కల్పించాలి.

**-క్రీడాకారులు క్రీడా ప్రాంగణాలు సద్వినియోగించుకోవాలి.**
**రురావత్ రమాదేవి. ఎంపిడిఓ**



22 క్రీడా ప్రాంగణాలకు డిస్ట్రిక్ స్పోర్ట్స్ ఆథారిటీ నుంచి క్రీడా సామాగ్రితో కూడిన కిట్లను అందజేశాం. కొన్ని ప్రాంగణాలను క్రీడాకారులు వినియోగించుకుంటున్నారు. మరి కొన్ని క్రీడా ప్రాంగణాలు నిరూపయోగంగా ఉన్నాయి. నిరూపయోగంగా ఉన్న క్రీడా ప్రాంగణాలను ఉపయోగంలోకి తీసుకువస్తాం. కొన్ని క్రీడా ప్రాంగణాల క్రీడా సామాగ్రి అందుబాటులో లేవని మా దృష్టికి వచ్చింది. తక్షణమే క్రీడా సామాగ్రి అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటాం.

# గ్రామ పంచాయతీ విధులు పక్కాగా జరగాలి

**-100 శాతం పన్నుల వసూళ్లు పూర్తి చేయాలి**
**-గ్రామ పంచాయతీల పనితీరుపై అదనపు కలెక్టర్ సమీక్ష**



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మంజిల్లాలో గ్రామ పంచాయతీల విధులు పక్కాగా జరిగేలా చూడాలని అదనపు కలెక్టర్ డా॥ పి.శ్రీజ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో గ్రామ పంచాయతీల పనితీరుపై అదనపు కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని గ్రామ పంచాయతీల పరిధిలో నూతన భవన నిర్మాణాలకు సంబంధించిన అనుమతులు నిబంధనల ప్రకారం జారీ చేయాలని, లేఅవుట్ అనుమతుల జారీ వివరాలు పక్కాగా నమోదు చేయాలని సూచించారు. గ్రామ పంచాయతీలలో నిర్దేశిత లక్ష్యం మేరకు 100 శాతం పన్ను వసూలు పూర్తిచేయాలన్నారు. గ్రామాల్లో వ్యాపారస్తుల ట్రేడ్ లైసెన్స్ రెన్యూవల్ జరిగేలా చూడాలని, పంచాయతీల్లో ఉండే సెల్ టవర్ల నుంచి ఫీజు సకాలంలో వసూలు చేయాలన్నారు. నూతన సెల్ టవర్ ఏర్పాటు ప్రతిపాదనలు సకాలంలో డిస్పోస్ చేయాలని ఆమె సూచించారు. గ్రామ పంచాయతీల్లో పారశుధ్య నిర్వహణ పట్ల ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, మల్టీపర్పస్ వర్కర్ల వేతనాలు, సిసి ఛార్జీలు, ట్రాక్టర్ లోన్ రిపేమెంట్ సకాలంలో చెల్లించాలన్నారు. ఉపాధి హామీ క్రింద మంజూరు చేసిన అభివృద్ధి పనులను గ్రామసభల ద్వారా ఆమోదింపజేసుకుని వెంటనే గ్రౌండ్ చేయాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత, డివిజనల్ పంచాయతీ అధికారి రాంబాబు, ఎంపిడివోలు, ఎంపివోలు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మారని అధికారుల తీరు..!





**-ఎప్పుడు వస్తారో తెలీదు..ఎప్పుడు పోతారో తెలీదు**
**-అడిగేవారు ఎవరూలేరు..!**

**ప్రజాపక్షం/పెనుబల్లిః** ఒకప్పుడు ఆర్ అండ్ బి కార్యాలయం అధికారులు, సిబ్బంది, గుత్తెదార్ల తో కళకళ లాడేది. జిల్లా, రాష్ట్ర అధికారులు, మంత్రులు పెనుబల్లి మండలం పర్యటన కు వస్తే విశ్రాంతి కొరకు విశ్రాంతి భవనం నిర్మించారు. అధికారులు నివాసం కొరకు భవనాలు నిర్మించారు. ఇవి ఒకప్పుడు ఉపయోగం లో ఉండేవి ప్రస్తుతం నిరూపయోగంగా ఉన్నాయి. శిథిలావస్థ లో ఉండగా ఇక్కడ విధులు నిర్వహిసున్న అధికారులు డిఇ, జెఇ, ఇతర పాలన సిబ్బంది ఎవరు విధులకు రారు. ఎప్పుడు వస్తారో ఎవరికీ తెలియదు. అక్కడ కనిపించేది కేవలం దిగువ స్థాయి సిబ్బంది మాత్రమే ఉంటారు. ఈ నెల మూడవ తేదిన సత్తుపల్లి యం యల్ఏ మట్టా రాగమయి ఆకస్మికంగా తనిఖీ నిర్వహించడం ఆరోజు సైతం కార్యాలయం లో అధికారులు లేక పోవటం తో ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. అయినా ఉద్యోగుల్లో మార్పు రాలేదు. శుక్రవారం సైతం కార్యాలయం లో ఖాళీ కుర్చీలు దర్శనం ఇచ్చాయి.

## మూడు గ్రామ పంచాయతీలో సర్వే పూర్తి

**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :**




తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటి కుటుంబ సమ గ్ర సర్వే పకడ్బందీగా తిరుమలాయపాలెం మండలంలో వేగంగా అధికారులు సర్వే చేపడుతున్నారని తహసిల్దార్ పి.వి రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుమలాయపాలెం మండలంలో 40 గ్రామ పంచాయతీల పరిధిలో ఉన్న గ్రామాల్లో మొత్తం 22 వేల 328 కుటుంబాలను గుర్తించగా ఇంటింటి కుటుంబ సర్వే ఇప్పటివరకు 20,060 కుటుంబాలను సర్వే చేశామని అజ్మీర తండా, జోగులపాడు, తిమ్మకపేట గ్రామపంచాయతీలో సర్వే పూర్తి అయిందని ఇప్పటివరకు 89 సర్వే పూర్తయినట్లు ఆయన తెలిపారు. ఈ సర్వేలో మండల అధికారులు పంచాయతీ కార్యదర్శులు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు అంగన్వాడి టీచర్లు సర్వేలో నిమగ్నమయ్యారని ఆయన తెలిపారు. జిల్లా కలెక్టర్ ముజామిల్ ఖాన్ నిర్దేశించిన సమయం కల్లా సర్వే పూర్తి చేస్తామని గ్రామాల్లో ప్రజలు ఇంటింటి కుటుంబ సర్వేకు సహకరించాలని ఆయన కోరారు.

## 26న జరగనున్న కలెక్టరేట్ ధర్నాను జయప్రదం చేయండి

**ప్రజాపక్షం/జూలూరుపాడుః** కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం గతంలో రైతాంగానికి వ్యతిరేకంగా తీసుకొచ్చిన నల్ల చట్టాలను, కార్మికుల హక్కులను హరించే విధంగా తెచ్చిన నాలుగు లేబర్ కోడలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నవంబర్ 26న జరుగుతున్న



కలెక్టరేట్ ధర్నాను జయప్రదం చేయాలని అఖిలపక్ష రైతు కార్మిక వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. జూలూరుపాడు లో శుక్రవారం ఎల్లంకి గార్డెన్లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్ర పాలకుల కార్పొరేట్ అనుకూల ఆర్థిక విధానాల వల్ల దేశ ప్రజలు రైతులు కార్మికులు అనేక కష్టాలను ఎదుర్కోని నష్టపోతున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా నాయకులు గుండె పిన్ని వెంకటేశ్వర్లు, అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బానోత్ ధర్మ, సిఐటియు జిల్లా నాయకులు యూసా నరేష్, అఖిల భారత రైతు కూలి సంఘం జిల్లా నాయకులు వల్లోజి రమేష్, టి యు సి ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎదలాపురం గోపాలరావు,తెలంగాణ రైతు సంఘం మండల కార్యదర్శి గడిదేశి కనకరత్నం, ఏఐటీయూసీ మండల కార్యదర్శి ఎస్కే చాంద్ పాషా, నాయకులు ఎల్లంకి మధు, వల్లమల సామెల్, కల్తి నరసరావు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో పాడిగేదెలు మృతి

**ప్రజాపక్షం-చింతకాని :** మున్నేరులో అమర్చిన విద్యుత్ మోటారు తీగెలు తగిలి రెండు పాడిగేదెలు మృత్యువాత పడ్డాయి. భాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం పందిళ్ళపల్లి గ్రామానికి చెందిన రైతు బొందుల సత్యనారాయణ తన పాడిగేదెలను మేత మేపేందుకు మున్నేరు పరీవాహక ప్రాంతానికి తోలుకుని వెళ్ళాడు.నీళ్లు తాగేందుకు మున్నేరులోకి వెళ్లిన రెండు గేదెలు రైతులు ఏర్పాటు చేసిన మోటార్లకు బిగించిన తీగలకు విద్యుత్ సరఫరా కావడంతో గేదెలు మృతిచెందాయి. గేదెల విలువ లక్షన్నరపైన ఉంటుందని తన జీవనాధార కోల్పాయానని భాధిత రైతు వాపోతున్నాడు.



## పేదింటి ఆడపడుచు పెళ్లికి 50 కేజీల బియ్యం అందజేత

**ప్రజాపక్షం/ఏన్కూరుః** మండల కేంద్రమైన ఏన్కూరు గ్రామానికి చెందిన పేద ఇంటి ఆడపడుచు పెళ్లికి ఇదే గ్రామానికి చెందిన శ్రీరాములు వీరబాబు 50 కేజీల బియ్యం శుక్రవారం అందజేశారు. ఏన్కూరులో కాల్వొడ్డు సమీపంలో నివాసం ఉంటున్న పటేల్ ఇనాయత్, కైసర్ కుటుంబం ఆర్థిక ఇబ్బందులతో తమ కూతురు పెళ్లిక ఓసం ఇబ్బందిపడుతున్నారన్న విషయం తెలుసుకున్న ఇదే గ్రామానికి చెందిన సహారా అగ్రి ప్రొడక్ట్ ప్రైవేట్ లిమిటెడ్ జోనల్ మేనేజర్ శ్రీరాముల వీరబాబు వారి కూతురి పెళ్లికి సహాయార్థం తనవంతు సహాయంగా 50కేజీల బియ్యాన్ని వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. తమ కుటుంబానికి 50 కేజీల బియ్యం అందజేసి సహాయ చేసిన వీరబాబుకి కుటుంబ సభ్యులు అభినందనలు తెలిపారు.

## అనాధ పిల్లలకు అన్నదానం

**-స్వెట్టర్లు, దుప్పట్లు పంపిణీ**

**ప్రజాపక్షం/మణుగూరుః** మణుగూరు మండలం సి.టైప్ దగ్గర గల బాల వెలుగు లోని అనాధ పిల్లలకు బిటిపిఎస్ హెల్పింగ్ హాండ్స్ వారి సహకారంతో చలికాలం కావటంతో స్వెట్టర్లు, దుప్పట్లు భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ సి.ఈ బిచ్చన్న చేతుల మీదుగా పంపిణీ చేయటం జరిగింది. అనంతరం పిల్లలకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసి వారికి స్వయంగా వడ్డన చేశారు. ఈ సందర్భంగా సి.ఈ బిచ్చన్న మాట్లాడుతూ పిల్లలు ఆత్మస్థైర్యం తో ఉండాలని, దృఢ సంకల్పంతో విద్యానభ్యసించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని అన్నారు.అంతేకాకుండా ప్రతి ఒక్కరు క్రమశిక్షణతో మెలగాలని, క్రీడల్లో కూడా మీ ప్రతిభ కనబర్చాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్లాంట్ సి.ఈ బిచ్చన్న తో బిటిపిఎస్ హెల్పింగ్ హాండ్స్ మిత్ర బృందం మరియు బాల వెలుగు నిర్వాహకులు పాల్గొన్నారు..

